ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు


3

సోమవారం 17 జూన్ 2024






పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు



అమరావతి రైలుపై.. ఆశలు

- పట్టాలపైకి రాజధాని రైలు మార్గం
- నాడు ఎన్డీఏ-1 ప్రభుత్వంలోనే మంజూరు
- ప్రాజెక్టు జోలికి వెళ్లకుండా వైసీపీ కాలయాపన
- కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో ప్రాజెక్టుకు సుగమం

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని రైలు మార్గం.. పదేళ్లుగా ఊరిస్తోన్న అంశం. గత టీడీపీ ప్రభుత్వంలో సర్వే పూర్తి చేసుకుని, డీపీఆర్ సిద్ధమైన ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కింది. మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఎన్డీఏ-3 ప్రభుత్వం అమరావతి రైలు మార్గానికి ప్రత్యేకంగా కొంత నిధులను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీంతో అమరావతి రైలుమార్గం ప్రాజెక్టుపై ఆశలు చిగురిస్తోన్నాయి. రైలు మార్గానికి అవసర మయ్యే భూమిని సేకరించి ఇవ్వడంతో పాటు 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. అయితే నిధుల కొరతతో రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో కేంద్రమే ఈ బృహత్తర ప్రాజెక్టుని చేపట్టాలని టీడీపీ ప్రభుత్వం కోరగా రైల్వే శాఖ సొంత నిధులతోనే పూర్తి చేయాలని భావించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ రాజధాని అంశాలతో పాటు ఈ నూతన రైలు మార్గం ప్రాజెక్టును పక్కన పడేసింది. టీడీపీ ఆధారిత ఎన్డీఏ-3 ప్రభుత్వం కేంద్రంలో పగ్గాలు చేపట్టిన నేపథ్యంలో రాబోయే బడ్జెట్‌లో కచ్చితంగా అమరావతి రైలుమార్గానికి మంచి జరుగుతుందని అంతా భావిస్తున్నారు.



అమరావతి రాజధాని నూతన రైలు మార్గం ఎలైన్‌మెంట్

సర్వే పూర్తి.. డీపీఆర్ సిద్ధం

ప్రపంచంలోనే ఉత్తమమైన రాజధాని నగరంగా అమరావతిని నిర్మించేందుకు పదేళ్ల క్రితమే అప్పటి టీడీపీ ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ని రూపొందించింది. అందులో అమరావతికి రైలుమార్గాన్ని కూడా పొందుపరిచింది. ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థ సర్వే కూడా నిర్వహించింది. తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఎర్రుబాలెం నుంచి అమరావతి మీదగా నంబూరు వరకు తొలి దశలో సింగిల్ లేన్ రైలుమార్గానికి డీపీఆర్ కూడా రూపుదిద్దుకొన్నది. ఇది ఒక విధంగా విజయవాడకు బైపాస్ రైలుమార్గంగా కూడా ఉపయోగపడుతుందని అప్పట్లో భావించారు. అలానే నరసరావుపేట నుంచి సత్తెనపల్లి, పెదకూరపాడు నుంచి అమరావతికి కూడా రెండు సింగిల్ లేన్‌మార్గాలను ఇందులో చేర్చారు. ఇందుకోసం మొత్తంగా రూ.2,800 కోట్లకు పైగా నిధులు ఖర్చు అవుతాయని అంచనా వేశారు.

ఈ ప్రాజెక్టులో కృష్ణానదిపై 3 కిలోమీటర్ల రైలు వంతెన నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కూడా ఈ ప్రాజెక్టుని చేర్చింది. అయితే నిధుల కేటాయింపు మాత్రం జరపకుండా జాప్యం చేసింది. సరిగ్గా అదే తరుణంలో ఎన్డీఏ-1లో బీజేపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నదని ఆ కూటమి నుంచి టీడీపీ బయటకు వచ్చేసింది. దాంతో ఒక విధంగా ఈ ప్రాజెక్టుని రైల్వే శాఖ అటకెక్కించింది. మరోవైపు 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిపై ఉన్న అక్కసుతో విధ్వంసానికి పాల్పడింది. అమరావతి కోసం ఒక్క రూపాయిని కూడా కేంద్రం నుంచి అడగలేదు. నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టులను ఎక్కడి కక్కడ నిలిపేసి మూడు ముక్కలాటకు తెరలేపి కాలయాపన చేసింది. దీంతో అమరావతి రైలుమార్గం మరిచిపోవాల్సిందేనని భావిస్తున్న తరుణంలో మళ్లీ బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమి కట్టి ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందుకున్నాయి. పైగా కేంద్రంలో టీడీపీకి చెందిన 16 ఎంపీలపై ఎన్డీఏ-3 ప్రభుత్వం ఆధారపడి ఉన్నది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు కూటమిలో కీలకభూమిక పోషిస్తారని ఇప్పటికే తేలింది. ఈ దృష్ట్యా రాబోయే బడ్జెట్‌లో కచ్చితంగా అమరావతి నూతన రైలుమార్గం నిర్మాణంలో అడుగులు పడేలా నిధుల కేటాయింపు జరిపిస్తారని అంతా భావిస్తున్నారు.

పాడుబెట్టారు.. పట్టించుకోండి

కొత్త ప్రాజెక్టులు కాదు కదా.. సాగునీటి కాల్వలకు కనీస మరమ్మతులు చేయాలన్న స్పృహ లేకుండా వైసీపీ ఐదేళ్ల పాలన సాగింది. రూపురేఖలు కోల్పోయి సాగు, తాగునీటి పారుదలకు అవరోధాలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నా వాటి బాగుపై నాటి ముఖ్యమంత్రి జగన్ దృష్టి సారించలేదు. వైసీపీ పాలనలో పాడుపెట్టిన కాల్వలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలని రైతులు ఆశిస్తున్నారు. నిధులు కేటాయించకుండా నిర్వహణను గాలికొదిలేసిన కాల్వలను బాగు చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలతో నిండి.. డ్రాపులు పగిలిపోయి.. షట్టర్లు దెబ్బతిని.. తూములకు కనీసం షట్టర్లు కూడా లేని నాగార్జున సాగర్ కాల్వలను బాగు చేసి సాగు నీటి పారుదల వ్యవస్థను చక్కదిద్ది ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉన్న కాల్వలను ఈ ఏడాదైనా బాగు చేయక పోతే సాగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధుల విడుదలకు కూటమి ప్రభుత్వంపై అన్నదాతలు కోటి ఆశలు పెట్టుకున్నారు. కనీసం అత్యవసర పనులైనా చేపట్టాలని కోరుతున్నారు.

- అధ్వానంగా మారిన సాగర్ కాల్వలు
- కనీస మరమ్మతులపైనా ఐదేళ్లుగా వైసీపీ నిర్లక్ష్యం
- కాడా నిధులను దారి మళ్లించిన జగన్ ప్రభుత్వం
- రూపురేఖలు కోల్పోయి నీటి పారుదలకు అవరోధాలు
- కాల్వల బాగుపై ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో లక్షల ఎకరాలు ఆయకట్టు ఉంది. వేలాది మంది రైతులు జీవనం సాగిస్తున్నారు. అయినా సాగర్ పరిధిలోని కాల్వల్లో సాగునీరు పారే పరిస్థితి లేదు. మేజర్లు, మైనర్, సబ్‌మైనర్ కాల్వలు శిథిలస్థితికి చేరుకున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో కాల్వలు రూపురేఖలు కోల్పోయి నీటి పారుదలకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఇంత అధ్వానంగా ఉన్న కాల్వల బాగుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించలేదు. నిధులు విడుదల చేయకుండా కాల్వలను పాడుబెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి కారణంగా కాల్వల మరమ్మతులపై జలవనరుల శాఖ ప్రతిపాదనలు కూడా రూపొందించలేదు. కాల్వల్లో కంప చెట్లు పెద్దఎత్తున పెరిగాయి. జమ్ము, తూటుకాడ, రబ్బరు మొక్కలు కాల్వల నిండా అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి. మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. నీటి సరఫరాలో నియంత్రణ లేకుండా పోయింది. దీంతో నీటి సరఫరాకు అవరోధంగా మారుతుంది. నాచు పెరిగిన వెంటనే తొలగించక పోవడంతో దిగువకు నీరు పూర్తి స్థాయిలో సరఫరా కావడంలేదు. ఈ పరిస్థితుల్లో కనీస మరమ్మతులు తప్పనిసరి అయినా ప్రతీ ఏటా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిధులు విడుదలపై ప్రభుత్వం స్పందించలేదు. సాగు నీటి సంఘాలకు ఐదేళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో కాల్వల బాగు గురించి పట్టించుకునే వారే లేకుండా పోయారు. నీటి సంఘాల బాధ్యతలను అధికారులకు ప్రభుత్వం అప్పగించగా వారు నిధుల కేటాయించక పోవడంతో వారు కూడా పట్టించుకోలేదు.



రూపురేఖలు కోల్పోయిన గోవిందాపురం మేజర్



తుర్లపాడు మేజర్‌లో పూడిపోయిన తూము



జమ్ముతో నిండిన మైనర్ కాలువ



కాలువలో పెరిగిన కంప

నీటి తీరువా వసూలైనా.. నిధుల కొరతే

రైతులు ఏటా నీటి తీరువా చెల్లిస్తారు. నీటి శిస్తు ద్వారా వచ్చిన ఆదాయంలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. నీటి తీరువా నిధులను కాడా కమిటీల వారీగా కేటాయించాలి. ఈ నిధుల్లో సగం మేజర్, సగం మైనర్ ఇరిగేషన్లకు కేటాయించాలి. 10 శాతం పరిపాలనకు, 15 శాతం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14 శాతం నిధులను ప్రాజెక్టు కమిటీకి కేటాయించాలి. ఇలా కేటాయింపులు ఐదేళ్లుగా జరగలేదు. ఏటా సాగర్ ఆయకట్టు పరిధిలో నీటి తీరువా రూ.20 నుంచి 21 కోట్లు వస్తుందని అంచనా. ఈ నిధులు కాడాకు చేరకుండా నేరుగా ప్రభుత్వ ఖజానాకు జమ చేసుకోవడంతో కాల్వల నిర్వహణకు నిధుల కొరత ఏర్పడింది. కాల్వల మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. నీటి తీరువా నిధులను ఏటా కాల్వల మరమ్మతులకు కేటాయించి ఉంటే కాల్వలు ఇంత అధ్వానంగా ఉండేవి కాదని రైతులు చెబుతున్నారు. రైతులు చెల్లించిన నీటి తీరువా శిస్తు నిధులను కాల్వల నిర్వహణకు ఖర్చు చేయకపోవడంతో అధ్వానంగా మారాయి. పూర్తిగా అధ్వానంగా ఉన్న కాల్వల మరమ్మతులను కూటమి ప్రభుత్వం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ కు కనీసం అత్యవసర పనులైనా నిర్వహించాలని పాలకులకు అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బిందుమాధవ్‌పై సస్పెన్షన్ తొలగింపు

- ఉత్తర్వులు విడుదల చేసిన ఎన్నికల సంఘం



నరసరావుపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పల్నాడు ఎస్పీగా ఉండి ఎన్నికల హింస నేపథ్యంలో వేటు పడిన బిందుమాధవ్‌పై ఉన్న సస్పెన్షన్‌ను ఎన్నికల సంఘం తొలగించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలింగ్ రోజు, ఆ తర్వాత జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఎస్పీ బిందుమాధవ్‌ను సస్పెండ్ చేయడంతో పాటు కలెక్టర్ శివశంకర్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రశాంత ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ కమిషన్ వారిపై గత నెల 16న చర్యలు తీసుకుంది. పోలింగ్ హింసకు సంబంధించి బిందుమాధవ్ ఇచ్చిన వివరణకు సంతృప్తి చెందిన ఎన్నికల సంఘం ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేస్తున్న ట్లు ప్రకటించింది. అయితే ఇతర పోలీసు అధికారులపై తీసుకున్న చర్యలకు సంబంధించి మాత్రం ఇంకా తేల్చ లేదు. శివశంకర్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఆయన నరసరావుపేటలోనే నివాసం ఉంటున్నట్లు సమాచారం.

రెండున్నరేళ్లలో అమరావతి పనులు పూర్తి

- రైతులకు కౌలు, పేదల పింఛన్లపై సీఎంతో మాట్లాడతా
- రైతులతో మంత్రి నారాయణ

విద్యాహక్కుకు మోకాలడ్డు 4లో..

- ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు మైండ్‌గేమ్
- విద్యాశాఖ సీట్లు కేటాయించినా అడ్మిషన్ ఇవ్వని వైనం

పిన్నెల్లి సోదరులు.. రౌడీలు





- ఎట్టకేలకు ప్రకటించిన పోలీసుశాఖ
- మాచర్ల పోలీసుస్టేషన్‌లో బ్రదర్స్‌పై రౌడీషీట్లు
- మాజీ ఎమ్మెల్యేపై 14.. వెంకట్రామిరెడ్డిపై 9 కేసులు
- బెయిల్‌పై ఎస్పీ కార్యాలయంలో అన్న సంతకం.. పరారీలో తమ్ముడు

నరసరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరుల్లో అన్న ఎమ్మెల్యే, తమ్ముడు వైసీపీ నేత. అధికారం అండతో మాచర్ల నియోజకవర్గంలో చెలరేగిపోయారు. రెండు దశాబ్దాలు ఎమ్మెల్యేగా చెలాయించిన వారు ఈసారి కూడా గెలిచి ఎవరూ అడ్డంరాకుండా.. ఎదురేలేదని నిరూపించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో అరాచకాలతో హింసకు దిగారు. చెప్పిందే చట్టం.. మాటే శాసనంగా అధికారం చెలాయించిన పిన్నెల్లి సోదరులు రౌడీలుగా పోలీసులు తేల్చారు. అధికారం అండతో ప్రభుత్వ వ్యవస్థలను చెప్పు చేతల్లో ఉంచుకుని అరాచకాలు సాగించగా.. వారికి కొమ్ము కాసిన పోలీసులే వారిపై రౌడీషీట్లు పెట్టారు. వీధి రౌడీల్లా ప్రవర్తించిన మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై మాచర్ల పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్లు తెరిచారు. మాచర్ల నియోజకవర్గంలో పోలింగ్, ఆ తర్వాత సాగించిన హింసా కాండకు సంబంధించి రామకృష్ణారెడ్డిపై 14, వెంకట్రామిరెడ్డిపై 9 కేసులు నమోదయ్యాయి. రామకృష్ణారెడ్డిపై నమోదైన 14 కేసుల్లో 307 సెక్షన్ కింద మూడు, వెంకట్రామిరెడ్డిపై ఉన్న 9 కేసుల్లో 307 సెక్షన్ కింద నాలుగు కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో రౌడీలుగా గుర్తింపు పొందినవారిలో ఒకరైన రామకృష్ణారెడ్డి బెయిల్‌పై నరసరావుపేటలో ఉంటూ రోజూ ఎస్పీ కార్యాలయంలో సంతకం చేస్తున్నాడు. ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి గత నెల 14 నుంచి పరారీలో ఉన్నాడు.

నాడు భయపెట్టారు.. నేడు భయపడ్డారు

మాచర్ల మారీచులుగా ముద్రపడిన పిన్నెల్లి సోదరులు తమకు అడ్డేలేదని చెలరేగిపోయారు. అక్రమ కేసులతో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టారు. తమ అరాచకాలకు అడ్డుగా ఉన్న వారిని, ప్రశ్నించే వారిని భయపెట్టి గ్రామాల నుంచి వలసలు వెళ్లేలా చేశారు. దాడులు చేసినా కేసులు నమోదు కాకుండా పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. అదే పోలీసులకు భయపడి తలదాచుకోవాల్సిన పరిస్థితులను ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్నారు. మొత్తం మీద పోలింగ్ హింసాత్మక ఘటనలు పిన్నెల్లి బ్రదర్స్‌కు భయాన్ని పరిచయం చేశాయి. భయపెట్టి ప్రత్యర్థులు గ్రామాల నుంచి వలసలు వెళ్లేలా చేసిన సోదరులు భయంతో అజ్ఞాతంలోకి వెళ్లారు. రామకృష్ణరెడ్డి బెయిల్‌పై ఉండగా వెంకట్రామిరెడ్డి ఇంకా పరారీలోనే ఉన్నాడు. హత్యాయత్నం కేసులు నమోదుతో పరారీలో ఉన్న వెంకట్రామిరెడ్డిని అరెస్టు చేయకుండా ఇంకా కొందరు పోలీసులు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోలీసులు తలుచుకుంటే వెంకట్రామిరెడ్డిని పట్టుకోవడం పెద్ద పని కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

హత్యాయత్నం కేసులు

- పాల్వాయిగేటు బూత్ వద్ద నంబూరి శేషగిరిరావు, ఓ మహిళపై దాడికి సంబంధించి రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద రెండు హత్యాయత్నం కేసులు.
- కారంపూడిలో జరిగిన విధ్వంసకాండ, సీఐ సహా పలువురిపై దాడి చేసిన కేసులో సోదరులపై 307 సెక్షన్
- మాచర్లలోని పీడబ్ల్యూడీ కాలనీలో టీడీపీ కార్యకర్తలను వాహనంతో తొక్కించిన వెంకట్రామిరెడ్డిపై మూడు హత్యాయత్నం కేసులు
- వెల్దుర్తి మండలం కండ్లకుంటలో చోటు చేసుకున్న ఘటనలకు సంబంధించి పిన్నెల్లి బ్రదర్స్‌పై కేసులు.
- వెల్దుర్తి మండలం కేపీగూడెంలో టీడీపీ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి సంఘటనలో 307 కేసు.

ఈసీ ఆదేశాలతోనే కేసులు..

ఎన్నో ఏళ్లుగా ఎదురు లేకుండా అధికారం చెలాయించిన పిన్నెల్లి సోదరులపై ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేసే సాహసం ఏ స్థాయి పోలీసులూ చేయలేదు. పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎంను ఎమ్మెల్యేగా ఉన్న రామకృష్ణారెడ్డి స్వయంగా ధ్వంసం చేయడం ఆ వీడియో ఆలస్యంగా వెలుగు చూడటమే పిన్నెల్లి సోదరుల పాలిట శాపంగా మారింది. అప్పటి వరకు ఈవీఎం ధ్వంసం ఘటనపై గుర్తు తెలియని వ్యక్తులు అని ఎన్నికల అధికారులు ఫిర్యాదు చేయగా పోలీసులు అలాగే కేసు నమోదు చేశారు. ఎన్నికల సంఘం దీనిపై విచారణకు ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింస, పిన్నెల్లి సోదరుల పాత్రపై వరుసగా కేసులు నమోదయ్యాయి.










న్యాయమూర్తి ప్రశాంత్‌కుమార్ మిశ్రాను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కేఎల్‌యూలో ముగిసిన రాష్ట్రస్థాయి న్యాయవాదుల శిక్షణా తరగతులు

తాడేపల్లి, జూన్ 16: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం నుండి జరుగుతున్న రాష్ట్రస్థాయి న్యాయవాదుల శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం నాటి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సుప్రీం కోర్టు న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్‌మిశ్రా మాట్లాడుతూ భారతీయ న్యాయసంహిత ఐపీసీని పోలి ఉందన్నారు. ఆధారాలు సేకరించడంలో, కేసుల్లో న్యాయవాదులు ఓర్పు, నేర్పు కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగ లక్ష్యాలను సాధించడంలో న్యాయవాదుల పాత్ర గణనీయమైందన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల న్యాయవాదుల్లో చైతన్యం వస్తుందని, చట్టాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. అనంతరం మిశ్రాను ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సత్కరించారు. పలు చట్టాలపై ప్రశాంత్‌కుమార్ మిశ్రా న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, మాజీ చైర్మన్ గంటా రామారావు, కేఎల్‌యూ వీసీ సారధివర్మ, బార్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ని కలిసిన సచివాలయాల ఉద్యోగులు


మంత్రి లోకేశ్‌ని కలిసిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు

గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కలిశారు. ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అంకమ్మరావు, రీజనల్ కో-ఆర్డినేటర్ తోట మహేష్‌ల ఆధ్వర్యంలో నాయకులు మంగళగిరి వెళ్లి లోకేశ్‌ని కలిసి సచివాలయాల ఉద్యోగుల సమస్యలను నివేదించారు. ప్రధానంగా జాబ్‌ఛార్ట్ సరిగా లేదన్నారు. తమ సర్వీసుని పూర్తిస్థాయిలో రెగ్యులరైజేషన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలపై లోకేశ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సమావేశం ఏర్పాటుచేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. అనంతరం మునిసిపల్ పరిపాలన శాఖ మంత్రి పీ నారాయణ క్యాంపు ఆఫీసుకు వెళ్లి అసోసియేషన్ నాయకులు ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్, ఆకుల గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

- సమస్యలపై మంత్రి లోకేశ్‌కు అర్జీల వెల్లువ
- అండగా ఉంటానని భరోసా ఇచ్చిన లోకేశ్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

మంగళగిరి, జూన్ 16: ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభిస్తుంది. లోకేశ్‌ను కలిసి సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు మంగళగిరి నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఉండవల్లిలోని నివాసంలో ఆదివారం మంత్రి లోకేశ్ ప్రజలను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. అర్జీలను స్వయంగా స్వీకరించి అన్నివిధాలా అండగా వుంటానని భరోసా ఇచ్చారు. డీఎస్సీ-2008, జీవో నెం.39 ప్రకారం ఎంటీఎస్ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 2,193 మందిని రెగ్యులర్ చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించకపోవడంతో తన పాలిటెక్నిక్ సర్టిఫికెట్లను నూజివీడు కాలేజీ నుంచి ఇప్పించాలని జగదీశ్ అనే విద్యార్థి కోరారు. ఏఎన్‌యూలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సేవలను 62 ఏళ్ల వరకు కొనసాగించాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. నులకపేట ఎంపీయూపీ ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి వరకు విద్యాబోధనకు అనుమతి ఇవ్వాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు, అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఐదు నెలల తన మేనల్లుడికి వైద్య సాయం అందించాలని మంగళగిరికి చెందిన షేక్ నజీనా, డిగ్రీ, ఎంబీఏ పూర్తిచేసిన తనకు, తన సోదరికి ఉద్యోగాలు కల్పించాలని తాడేపల్లికి చెందిన కే కిరణ్‌బాబు, మౌనికలు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుడైన తనకు 40 ఏళ్ల వచ్చినా ఉద్యోగం రాలేదని, గత ప్రభుత్వంలో నష్టపోయానని, జీవనోపాధి కల్పించాలని తాడేపల్లికి చెందిన బి.శ్రీనివాసరావు విన్నవించారు. తమకు ఇల్లు మంజూరుచేయాలని రాధారంగనగర్‌కు చెందిన యర్రంశెట్టి సీతారాములు, బొంతల మారుతీప్రసాద్ కోరారు. అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న తనకు ధర్నాలో పాల్గొన్నామనే నెపంతో గత ప్రభుత్వం ప్రమోషన్ నిలిపివేసిందని, తనకు ప్రమోషన్ ఇప్పించాలని కొలనుకొండ రాజేశ్వరి, ఎయిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగం కల్పించాలని మంగళగిరికి చెందిన పెదపూడి మార్తమ్మ విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను సావధానంగా విన్న లోకేశ్.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యాహక్కుకు మోకాలడ్డు

- ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు మైండ్‌గేమ్
- విద్యాశాఖ సీట్లు కేటాయించినా అడ్మిషన్ ఇవ్వని వైనం

గుంటూరు(విద్య), జూన్ 16: విద్యాహక్కు చట్టాన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు అపహాస్యం చేస్తున్నాయి. చట్టం ద్వారా పేద విద్యార్థు లకు సక్రమించిన హక్కుల్ని కాలదన్నేలా తల్లిదండ్రు లతో మైండ్‌గేమ్ ఆడుతున్నాయి. ఆర్‌టీఏ(విద్యాహక్కు చట్టం) ద్వారా విద్యాశాఖ సీట్లు కేటాయించినా ప్రైవేటు యాజమాన్యాలు తమ పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్చుకునేందుకు మోకాలడ్డుతు న్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 2 వేలకుపైగా చిన్నా పెద్ద ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు దాదాపు వెయ్యికిపైగా సీట్లు కేటాయించినట్లు సమాచారం. దాదాపు రెండు నెలల ముందే ఇందుకోసం విద్యాశాఖ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీట్లు కేటాయింపు జరిగింది. విద్యాశాఖ ఇచ్చిన అడ్మిషన్ ప్రకారం ఆయా ప్రైవేటు విద్యాసంస్థలు ఎటువంటి ఫీజులు లేకుండా విద్యార్థుల్ని పాఠశాలల్లో చేర్చుకోవాలి. అయితే అనేక విద్యాసంస్థలు ఇందుకు ససేమిరా అంటున్నాయి. అనేక ప్రాంతాల్లో తల్లిదండ్రుల్ని ముప్పతిప్పలు పెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. విద్యాహక్కు సీట్లకు సంబంధించి ప్రభుత్వం ఫీజులు ఎప్పుడు చెల్లిస్తుందో తెలియదని, అందుకే ముందు మొత్తం ఫీజులో సగం చెల్లించి అడ్మిషన్ తీసుకోవాలని యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. కోర్టులో కేసులు వేశామని.. ఒకవేళ తాము గెలిస్తే మొత్తం ఫీజు చెల్లించాలంటూ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమానులు తల్లిదండ్రులతో మైండ్‌గేమ్ ఆడుతున్నాయి. దీంతో ఏమిచేయాలో పాలుపోక తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైనా అనేక పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ద్వారా సీట్లు పొందిన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వడంలేదు. క్షేత్రస్థాయిలో ఈ సమస్యలను పరిష్కరించాల్సిన ఎంఈవోలు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. సీట్లు ఇచ్చాం.. ఇక మీరు యాజమాన్యాలే చూసుకోండి అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేసి ఆర్‌టీఏ సీట్లపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వికసిత్ భారత్‌లో ఉప్పలపాడు విద్యార్థిని


శ్రీలక్ష్మికి మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

పెదకాకాని, జూన్ 16: గుజరాత్‌లో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు జరిగిన వికసిత్ భారత్ కార్యక్రమంలో పెదకాకాని మండలం ఉప్పలపాడు జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి విద్యార్థిని తాడిపోయిన శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ప్రధాని మోదీ డ్రీమ్ ప్రాజెక్ట్ వికసిత్ భారత్ కార్యక్రమానికి శ్రీలక్ష్మి ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైంది. ప్రధాని మోదీ చదువుకున్న స్కూలు వద్ద వికసిత్ భారత్ కార్యక్రమం జరిగినట్లు శ్రీలక్ష్మి తెలిపారు. దేశంలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలు, కళల గురించి తమకు వివరించినట్లు విద్యార్థిని చెప్పారు.

కొడాలి నాని చంద్రబాబు బూట్ పాలిష్ చేయాలి

- గుంటూరు నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసిన కనపర్తి



కొడాలి నాని, చంద్రబాబు బూట్లు తుడుస్తున్నట్లుగా గుంటూరులో వెలసిన ఫ్లెక్సీ

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): చంద్రబాబుకు బూట్‌పాలిష్ చేస్తున్న కొడాలి నాని ఫొటోలతో గుంటూరు నగరంలో ఆదివారం ఫ్లెక్సీలు వెలిశాయి. నిలువెత్తు ఫొటోలో సీఎం చంద్రబాబు, ఆయన కాళ్ల వద్ద కూర్చుని కొడాలి నాని బూట్లు పాలిష్ చేస్తున్నట్లు ఆ ఫ్లెక్సీల్లో ముద్రించి నగరంలో పలుచోట్ల ప్రదర్శనకు పెట్టారు. చంద్రబాబు కుప్పంలో గెలిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకొని, ఆయనకు బూట్ పాలిష్ చేస్తూ, ఆయన ఇంటి వద్దనే పడి ఉంటానని ఛాలెంజ్ చేసిన కొడాలి నాని ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడో బయటకు రావాలని ఫ్లెక్సీల్లో డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పేరుతో ఏర్పాటుచేసిన ఆ ఫ్లెక్సీలను తీసి వేయించటానికి పోలీసు అధికారులు కనపర్తిపై తీవ్ర వత్తిడి తీసుకురాగా, ఆయన దానికి ససేమిరా అంటున్నారు. ఈ సందర్భంగా కనపర్తి మీడియాతో మాట్లాడారు. ఛాలెంజ్ ప్రకారం చంద్రబాబు పెద్ద మెజారిటీతో కుప్పంలో విజయం సాధించాడని, గుడివాడలో కొడాలి నాని ఘోరంగా ఓడిపోయాడని తెలిపారు. తమ అధినేత చంద్రబాబుని, ఆయన కుటుంబ సభ్యులను తీవ్రంగా దూషించినప్పుడు పోలీసులు కేసు నమోదుచేసి చర్యలు చేపడితే తాము ఇప్పుడు ఇలా ప్రవర్తించే వాళ్ళం కాదని కనపర్తి అన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పు తెలుసుకొని కొడాలి నాని, వంశీ, అంబటి రాంబాబు, రోజా తదితరులు బేషరతుగా చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఫర్నిచర్ దొంగ జగన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

ప్రభుత్వ సొమ్ముతో ఫర్నిచరు కొనుగోలు చేసి పదవిపోయినా ప్రభుత్వానికి అప్పజెప్పకుండా కాకమ్మ కబుర్లు చెపుతున్న ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహనరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. గతంలో సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు కూడా ఫర్నిచరుకు విలువ కడితే డబ్బు చెల్లిస్తామని పదేపదే ప్రభుత్వానికి లేఖలు రాసినా పట్టించుకోకుండా ఆయనపై కేసు నమోదు చేసి ఆత్మహత్యకు జగన్‌రెడ్డి కారకుడయ్యాడని ఆరోపించారు. కోడెల, వివేకానందరెడ్డి ఉసురు తగిలి జగన్ రెడ్డికి డజను సీట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. తను చేసిన హత్యలు, ఆర్థిక నేరాలకు రాజ్యసభసభ్యులను, శాసనమండలి సభ్యులను పణంగా పెట్టడం సిగ్గు చేటన్నారు.

రెండున్నరేళ్లలో అమరావతి పనులు పూర్తి

- రైతుల కౌళ్లు, పేదల పింఛన్ల సీఎంతో మాట్లాడతా
- రాజధాని రైతులతో పురపాలక శాఖ మంత్రి నారాయణ


సచివాలయంలో మంత్రి నాయణను కలిసిన అమరావతి రైతు జేఏసీ నేతలు

తుళ్లూరు, జూన్ 12: రెండున్నరేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేసే విధంగా ప్రణాళికలను సిద్ధం చేస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగులూరి నారాయణ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించిన నారాయణను రైతు జేఏసీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 నుంచి 2019వరకు అమరావతి పనులపై అవగాహన ఉందన్నారు. రాజధాని ప్రాంతంలోని రోడ్లు, డ్రెయిన్లు, అసెంబ్లీ, సచివాలయం ఐదు టవర్లను పూర్తి చేస్తామని చెప్పారు. 217 చదరపు కిలోమీటర్ల మేర అమరావతి నగర నిర్మాణం మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగుతుందన్నారు. రూ.48 వేల కోట్ల పనులకు గాను గతంలో 9 వేల కోట్లతో పనులు అప్పట్లోనే జరిగాయన్నారు. మినిస్టర్స్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఉద్యోగుల క్వార్టర్లు 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి రాజధాని నిర్మాణ పనులను పక్కన పెట్టి అడవిని చేసిందన్నారు. రైతులకు కౌళ్లు, నిరుపేదలకు పింఛన్లను మంజూరు చేయాలని రైతులు కోరగా దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం రెండేళ్లుగా కౌళ్ల చెల్లించలేదని రైతులు మంత్రికి తెలిపారు. జేఏసీ నేతలు జొన్నలగడ్డ కిరణ్, ఉప్పలపాటి సాంబశివరావు, బెల్లంకొండ నరసింహారావు, కారుమంచి నరేంద్ర, జమ్ముల కిరణ్(బాబి), అనుమోలు సత్యనారాయణ, ఆకుల ఉమామహేశ్వరావు, పాలకాయల గోపాల్రావు మంత్రిని కలిశారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి ఉద్యమ సమయంలో తమకు అండగా ఉన్నందుకు .అమరావతి జేఏసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలు ఇచ్చిన మెజార్టీలు బాధ్యతను పెంచాయి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి

- ప్రత్తిపాటిని కలసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు చింతమనేని, తెనాలి శ్రావణ్ కుమార్


ఎమ్మెల్యే ప్రత్తిపాటిని మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, ప్రభాకర్

చిలకలూరిపేట అర్బన్, జూన్ 16: ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అద్భుత విజయం, భారీ ఆధిక్యాలు తమపై బాధ్యత మరింత పెంచాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వేగం, ప్రజల ఆకాంక్షలను అందుకోవటమే తమ ముందున్న లక్ష్యం అన్నారు. ఆదివారం తాడికొండ, దెందులూరు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, చింతమనేని ప్రభాకర్ ప్రత్తిపాటి పుల్లారావును పట్టణంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటం, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, స్థానిక సమస్యల పరిష్కారం విషయంలో సత్వర స్పందనలే తమ ముందున్న లక్ష్యాలు అన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు మార్గదర్శకులుగా ఉండాల్సిన బాధ్యత కూడా తమపై ఉందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు పల్నాడు జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు ప్రత్తిపాటిని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

చేయూత ఇవ్వాలని నరెడ్కో వినతి

గుంటూరు(కార్పొరేషన్): గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో నష్టపోయిన నిర్మాణరంగానికి చేయూత ఇవ్వాలని నరెడ్కో ప్రతినిధులు మంత్రి నారాయణను కోరారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని వారి ని మంత్రి కోరారు. కార్యక్రమం లో నరెడ్కో అధ్యక్షుడు నాగ వంశీ, ప్రతినిధులు శ్రీనాథ్, వై దుర్గాప్రసాద్, జీ తిరుపతిరావు, ఎస్ మధుసూదన్‌రెడ్డి, ఎన్ శ్రీనివాస్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జీవో నం.117ని రద్దుచేయాలి

- ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు


మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్‌బాబు

గుంటూరు(విద్య), జూన్ 16: గుణాత్మక విద్యను దెబ్బతీసేలా ఉపాధ్యాయుల మీద పనిభారాన్ని పెంచుతూ గత ప్రభుత్వ హయాంలో అమలు పరిచిన జీవో నం. 117ని రద్దు చేయాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్ బాబు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బోధనకు అడ్డుగా ఉన్న అనేక యాప్‌లను రద్దు చేయాలని కోరారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ఒక జూనియర్ అసిస్టెంట్‌ని కేటాయించి ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెదబాబు, ప్రధానకార్యదర్శి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పుస్తకాలు, యూనిఫామ్స్ స్కూల్‌పాయింట్‌కి అందేలా ఏర్పాటుచేయాలని డిమాండు చేశారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామచంద్రయ్య, ఉపాధ్యక్షులు వాసిమళ్ల ప్రసాద్, జిల్లా ఆర్థిక కార్యదర్శి వీరాంజనేయులు, గౌరవాధ్యక్షుడు ప్రసాద్‌బాబు, రాష్ట్ర కౌన్సిలర్స్ బాజీ, జోసెఫ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు

బస్సు క్లీనర్ మృతి.. పదిమందికి పైగా గాయాలు

సత్తెనపల్లి రూరల్, జూన్ 16: ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొనటంతో బస్సు క్లీనర్ మృతి చెందగా పదిమందికి పైగా గాయాలైన సంఘటన మండలంలోని కంటెపూడి సమీపంలో ఆదివారం జరిగింది. సత్తెనపల్లి రూరల్ పోలీసుల కథనం మేరకు... బాపట్ల నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు కంటెపూడి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించ బోయి ఆగి ఉన్న లారిని ఢీకొంది. ప్రమాదంలో నరసరావుపేట మండలం కాకానికి చెందిన బస్సు క్లీనర్ తమ్మిశెట్టి మణికంఠ(24) అక్కడికక్కడే మృతిచెందగా బస్సులో ప్రయాణిస్తున్న పదిమందికి పైగా స్వల్ప గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు క్షతగాత్రులను సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశామని, బస్సు డ్రైవర్ ఈదర రమేష్‌బాబును అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

- 5 లక్షలిస్తే వీసా, టికెట్, ఉద్యోగ కల్పన బాధ్యత నాదే
- 50 మందికి పైగా నిరుద్యోగులకు కుచ్చుటోపీ

కెనడాలో ఉద్యోగాల పేరిట ఎర

గుంటూరు, జూన్ 16: 'మీకు ఎలాంటి విద్యార్హత లేకపోయినా ఫర్వాలేదు. కెనడాలో మీకు ఉద్యోగం ఇప్పిస్తా. నెలకు రెండున్నర లక్షల జీతం. దీనికోసం మీరు చేయాల్సింది.. అక్కడ మీరు సంపాదించబోయే రెండు నెలల జీతాన్ని ముందుగా ఇక్కడ పెట్టుబడి పెట్టడమే" అంటూ ఓ కన్సల్టెన్సీ నిరుద్యోగులు, చిరు వ్యాపారులు, చేతి వృత్తుల వారికి ఆశలు కల్పించింది. కెనడా డాలర్లను ఆశగా చూపి వారి వద్ద నుంచి రూ.కోట్లలో వసూలు చేసి వారందరికీ కుచ్చుటోపి పెట్టింది. విజయవాడలోని ఓ కన్సల్టెన్సీ నిర్వాహకురాలి వలలో చిక్కుకున్న బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన మాయలాడి నిర్వాకానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

గతంలో విజయవాడ ఆటోనగర్‌లోని ఓ కన్సల్టెన్సీ ద్వారా కొంతమంది యువకులు విజిటింగ్ వీసాపై కెనడా వెళ్లి అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. వారిని చూసి మరికొందరు కూడా కెనడా వెళ్దామని భావించి ఆటోనగర్‌లోని కన్సల్టెన్సీని సంప్రదించారు. ఆ కన్సల్టెన్సీలో భాగస్వామి అయిన ఓ యువతి బాధితులకు పరిచయమై.. కెనడాలో ఉద్యోగం ఇప్పిస్తానని వారందరికీ నమ్మకం కలిగించింది. అదే సమయంలో ఆ కన్సల్టెన్సీలో భాగస్వామితో విభేదాలు వచ్చి ఆమె బయటకు వచ్చేసింది. ఏలూరు రోడ్‌లో మరో కన్సల్టెన్సీ స్థాపించి వారందరినీ అక్కడకు పిలిపించుకుంది. గత డిసెంబరు నుంచి ఒక్కొక్కరి వద్ద ఐదు లక్షలు కట్టించుకుంది. ఉభయ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి గుంటూరు వరకు అనేకమంది ఆమెకు డబ్బులు కట్టారు. గుంటూరుకు చెందిన కే అనిల్ కుమార్ నుంచి రూ.5 లక్షలు కట్టించుకుంది. ఆమె సూచన మేరకు బ్రిటన్‌లో ఎమ్మెస్ చదువుతున్న అనిల్ కుమార్ అన్న కుమార్తెను కూడా చదువు మధ్యలోనే ఆపేసి స్వదేశానికి రప్పించారు. ఆ యువతి కూడా కన్సల్టెన్సీ నిర్వాహకురాలికి రూ.5లక్షలు చెల్లించారు. మీకు వీసా వచ్చిందని, ఉద్యోగం కూడా రెడీగా ఉందని ఏప్రిల్ 25న కెనడా వెళ్లిపోవడమే అని నమ్మించింది. ఇందుకుగాను వారిరువురి పేరుతో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షలతో విమాన టికెట్లు బుక్ చేసినట్లు నకిలీ టికెట్లు కూడా పంపింది. తక్షణం డబ్బులు చెల్లిస్తే టికెట్ బుక్ అవుతుందని.. లేదంటే వీసా కూడా రద్దవుతుందని భయపెట్టింది. నిజమేనని నమ్మిన బాధితులు మరో మూడున్నర లక్షలు ఆమెకు చెల్లించారు. అనంతరం వారు కెనడా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తీరా గడువు సమీపించే సమయానికి ఆమె మాట మార్చింది. సాంకేతిక సమస్య వచ్చిందని త్వరలోనే మీరు వెళ్లే తేదీని ఖరారు చేస్తానని కాలయాపన చేసింది. దీంతో బాధితులు తాము మోసపోయామని భావించారు. అదే సమయంలో వివిధ జిల్లాలకు సంబంధించిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ కార్యాలయం చుట్టూ తిరుగుతుండడంతో వారందరూ కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి చర్చించుకున్నారు. మోసపోయామని గ్రహించి రెండు రోజుల క్రితం ఏలూరు రోడ్‌లోని కన్సల్టెన్సీ కార్యాలయానికి వెళ్లి తమ డబ్బులు తిరిగిచ్చేయాలని డిమాండ్ చేశారు. కానీ, ఆమె వారిని తీవ్రస్థాయిలో బెదిరించింది. బాధితులే తనకు తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చి మోసం చేయబోయారంటూ విజయవాడ కమిషనర్, మాచవరం సీఐకి ఫిర్యాదు చేసినట్టుగా తయారు చేసిన ఫిర్యాదును అనిల్ కుమార్‌కు పంపి పరోక్షంగా బెదిరించింది. ఈ నకిలీ కన్సల్టెన్సీ నిర్వాహకుల చేతిలో మోసపోయిన వారిలో అత్యధిక మంది పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారే ఉన్నారు. ఇప్పుడు వారంతా లబోదిబోమంటున్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యా రు. తమను మోసం చేసిన కన్సల్టెన్సీ నిర్వాహకురాలి నుంచి తమ సొమ్మును రికవరీ చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐటీఐ విద్యార్థులకు అడ్మిషన్ కౌన్సెలింగ్

తెనాలి, మారీసుపేట జూన్ 16: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల నందు ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అడ్మిషన్ కౌన్సెలింగ్‌ని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ తెనాలిలో ఈ నెల 19, 20వ తేదీలలో నిర్వహిస్తుందని ప్రిన్సిపాల్, కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్‌ను, మెరిట్ నెంబరును తీసుకొని కౌన్సెలింగ్‌నకు హాజరుకావల్సిందిగా కోరారు. 19వ తేదీన మెరిట్ నెంబర్ 1నుండి 304(జీపీఏ 10 నుండి 5.3) వరకు, 20వ తేదీన మెరిట్ నెంబర్ 305 నుండి 537 (జీపీఏ 5.2 నుండి 1.3) వరకు విద్యార్థులకు ఉదయం గం.10నుండి సాయంత్రం గం.5వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ మెరిట్ నెంబర్ కొరకు 86866 89234, 93477 95839 నెంబర్లలో లేదా ఉదయం గం.10 నుండి సాయంత్ర గం.5 లోపు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థ, తెనాలినందు సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఏపీ కాపు, బలిజ ఉపకులాల జేఏసీ జిల్లా మహిళా కార్యవర్గ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన మహిళ కార్యవర్గ సభ్యులు

గుంటూరు(తూర్పు), జూన్ 16: స్థానిక అరండల్‌పేట, విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం ఏపీ కాపు, బలిజ ఉప కులాల జేఏసీ మహిళా జిల్లా కార్యవర్గ, కాపు జేఏసీ టైలర్స్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జేఏ సీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్‌నాయుడు హాజరై ఎన్నికల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ టైలర్స్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడిగా చెల్లుబోయిన వెంకట సూర్యశ్రీనివాసరావు, జిల్లా కాపు జేఏసీ మహిళా అధ్యక్షురాలిగా తిరుమలశెట్టి కృష్ణకుమారి, నగర విభాగంలో అధ్యక్షురాలిగా గడదాసు అరుణ, కార్యదర్శిగా తోట శివకుమారి, సంయుక్త కార్యదర్శి శెట్టి సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలుగా కుంచా నాగమణి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షురాలుగా దాది సింధు ప్రియ, టి.ధనలక్ష్మిలని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుణ్ణం సాయిబాబు, గోగిశెట్టి మార్కండేయులు, జేటీ రామారావు, లక్ష్మీసుకన్య, నంది వెలుగు కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ తోట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ దొంగ జగన్‌పై సెక్షన్ 409 కేసు పెట్టాలి

● మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఫర్నీచర్ దొంగ జగన్‌పై 409 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ డిమాండ్ చేశారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆది వారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాడు విష ప్రచారంతో కోడెలను బలితీసుకున్న వైసీపీ ప్రభుత్వం ఇప్పుడేం సమాధానం చెబుతుందని నిలదీశారు. మాజీ సీఎం జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా నిధులు దుర్వినియోగం చేయడంతోపాటు తన సొంత ఇంటికి కూడా ప్రభుత్వ ఖజానా నుంచే విలువైన ఫర్నీచర్ కొనుగోలు చేశారని, అధికారం కోల్పోయాక కూడా వాటిని సెరండర్ చేయకుండా వాడుకుంటున్న జగన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాడు లక్ష రూపాయల విలువ చేసే ఫర్నీచర్ కోడెల శివప్రసాదరావు దొంగిలించారని ఆయనపై తప్పుడు కేసు పెట్టి ఆయనను హింసించి హతమార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడెల తరహాలోనే జగన్‌పై కేసు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

నవ్వుల్లో ముంచెత్తిన హాస్యవల్లరి


ఎన్నికల్లో.. హాస్యనాటికలో ఓ సన్నివేశం

గుంటూరు(తూర్పు), జూన్ 16: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై గుంటూరు హ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో 114వ హాస్యవల్లరి సందర్భంగా ఆదివారం ప్రదర్శించిన హాస్యవల్లరి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి షేక్ లాల్ వజీర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నటీనటులు పి.రమేష్, ఎ.నాగజ్యోతి, ప్రొఫెసర్ జె.కిశోర్‌బాబు, డాక్టర్ కె.కళాధర్, పి.మంగయ్య, మధువని, బీటీ అప్పారావు, కె.కృష్ణ ప్రసాద్, ఎమ్ రాజేంద్రప్రసాద్, ఎస్‌వీకే ప్రసాద్ తదితరులు ఎన్నికల్లో, చిరు సన్మానం, ఇదెక్కడి గొడవే అనే లఘు హాస్యనాటికలను ప్రదర్శించారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న అవోపా సభ్యులు

గుంటూరు(విద్య), జూన్ 16: స్థానిక అరండల్‌పేటలోని ఆర్యవైశ్య ఆఫీషియల్స్ ప్రొఫెషనల్స్(అవోపా) ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ చింతా రామకృష్ణ మాట్లాడుతూ పేదల ఆర్థిక ఇబ్బందులు తొలగించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతైనా ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా మొత్తం 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ పసుమర్తి విశేశ్వరరావు, అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, నగర కార్యదర్శి రాధకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, ఊటుకూరి నాగేశ్వరరావు, రమణానంద్, అమరా రమేష్, కోర్డినేట్ మద్ది సాయి రామ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

గుంటూరు (తూర్పు), జూన్ 16: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం దశపాపహరం సందర్భంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీహోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులచే 9 మంది వేద పండితుల నిర్వహణలో గణపతి స్వామికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

.గుంటూరు(కార్పొరేషన్), జూన్ 16 : పాత బస్టాండ్ లాలాపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుంచి 23 తారీకు వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు(వాసు) ఆదివారం తెలిపారు. నేటి ఉదయం వెంకటేశ్వర స్వామి వారిని, అలివేలు మంగాదేవి పెళ్లి కుమారుడు పెళ్లి కుమార్తెగా అలంకారం చేయనున్నారు. సాయంత్రం 6గంటలకు అంకురారోపణ, ధ్వజారోహణ, విశ్వేశ్వర పూజ, పుణ్యావచన, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులంతా స్వామివారి బ్రహ్మోత్స వాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.


ప్రత్యేక అలంకరణలో లాలాపేట వెంకటేశ్వర స్వామి

నరసింహస్వామి అలంకారంలో వేణుగోపాల స్వామి.

గుంటూరు(కార్పొరేషన్), జూన్ 16 : కొత్తపేటలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం వేణుగోపాలస్వామి వారు నరసింహ స్వామి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రతి రోజు స్వామివారికి నిత్య కైంకర్యాలు, ప్రత్యేక పూజలు, హోమాలను జరిపిస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో వేణుగోపాల స్వామి



చినుకు పడితే.. పట్నంబజార్ మురుగుమయం


పట్నంబజారులో చినుకు పడితే రోడ్ల పైకి ప్రవహిస్తున్న మురుగు



గుంటూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి కూత వేటు అంత దూరంలో ఉన్న పట్నంబజార్‌లో చినుకు పడితే డ్రెయిన్లలోని మురుగు అంతా రోడ్లపైకి ప్రవహిస్తున్నది. ఆ తర్వాత పాదచారులు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి తలెత్తుతు న్నది. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, ఉన్న సైడుకాలువలపై మురుగు తొలగించనీయకుండా ఆక్రమించేయడం తదితర కారణాలతో మురుగు సమస్య జటిలంగా మారింది. నగరంలో వాణిజ్య కేంద్రంగా ఉన్న పట్నంబజార్‌లో ఈ పరిస్థితి నెలకొనడం అవాంఛనీయం. ఇక్కడికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా వర్తకులు, ప్రజలు వస్తుంటారు. వర్షం కురిసిన సందర్భాల్లో రోడ్లపైకి వచ్చిన మురుగు చూసి ఇదేమి నగరం అంటూ ఛీదరించుకొనే పరిస్థితి కొన సాగుతున్నది. తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా నగరపాలకులు ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి సమస్యకు పరిష్కారం కనుగొనాలని స్థానికులు కోరుతున్నారు.

బక్రీద్ పండుగ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

● ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఆచరించే బక్రీద్ పండుగకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, ఏ ఒక్కరికీ అసౌకర్యం కలగరాదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అధికారులను ఆదేశించారు. ఈనెల 16న బక్రీంద్ పర్వదినం నేపథ్యంలో నగరంలోని ఈద్గాలను ఆయన పరిశీలించారు. నగరంపాలెం, ఉర్దూ హైస్కూలు, ఐపీడీ కాలనీ, ముస్లిం కాలేజీల వద్ద నున్న ఈద్గాల వద్ద చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ బక్రీద్ అని, ఆరోజు మత పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈద్గాలలో ప్రార్థనలు చేస్తారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉర్దూ హైస్కూల్లో ఉదయం 8గంటలకు, ముస్లిం కాలేజి, నగరంపాలెం, ఐపీడీ కాలనీల్లో ఉదయం 9 గంటలకు ప్రార్ధనలు జరుగుతాయని, ప్రార్ధన కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.


ఈద్గా వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న నసీర్

కార్యక్రమంలో నగర పాలకసంస్థ అధికారులు ఈఈ కోటేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, రామయ్య, రెహమాన్, ముస్లిం మతపెద్దలు, టీడీపీ మైనార్టీ విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు తక్షణమే ఆపాలి : కేఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న విరసం నాయకుడు సీఎస్‌ఆర్ ప్రసాదు తదితరులు

గుంటూరు(తూర్పు), జూన్ 16: పాలస్తీనాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని తక్షణమే ఆపాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేట, యూటీఎఫ్ సమావేశ మందిరంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఎస్ హనుమంతరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా విరసం నాయకుడు సీఎస్‌ఆర్ ప్రసాదుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత 8నెలలుగా సాగిస్తున్న మారణహోమంలో 36వేల మంది మరణించారని, తాజాగా మే26న రఫాపై జరిగిన దాడిలో 45 మంది అమాయక ప్రజలు బలైయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికన్ సామ్రాజ్యవాద అండతో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఈ దుష్టచర్యలు యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతి కలిగిస్తుందన్నారు. విరసం నాయకులు ప్రసాదు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రఫా దాడులను ఖండిస్తూ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు సమ్మె చేయడం హర్షించదగ్గ విషయమని, మన దేశంలో కూడా ఇటువంటి సంఘీభావ ర్యాలీలు, ఉద్యమాలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. సదస్సులో ప్రజాసంఘాల నాయకులు వై నేతాజీ, చిష్టీ, బాషా, సలీం, కోలా నవజ్యోతి, అరుణ, పద్మ, ఎం కళాధర్, బేగం, వీవీకే సురేష్, జి.ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష నిండా వెలుగుల తళుకులే

● ప్రముఖ సాహితీవేత్త పూసపాటి కృష్ణ సూర్యకుమార్

గుంటూరు, జూన్ 16: తెలుగు భాష నిండా అడుగడుగునా చమక్కుల వెలుగులే అని ప్రముఖ సాహితీవేత్త పూసపాటి కృష్ణ సూర్యకుమార్ తెలియజేశారు. అమరావతి సాహితీమిత్రులు ఆదివారం ఉదయం గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై 'తెలుగు భాషలో చమక్కులు' గురించి ప్రసంగించారు. తెలుగు భాష నుడికారం గొప్పదని, జాతీయాలు సామెతలు ఎంతో అర్థవంతమైన చమత్కారాన్ని కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రముఖ కవి, సాహిత్య విశ్లేషకులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో 'ఈ మాసం కవి'గా రాచపాళెం రఘు(చిలకలూరిపేట) స్వీయ కవితలు వినిపించారు. 'వెండితెర వేలుపు నందమూరి తారక రామారావు' పరిశోధనా గ్రంథాన్ని రచించిన ప్రముఖ సాహితీవేత్త, నాటక రచయిత, నటులు మన్నే శ్రీనివాసరావును, గ్రంథాన్ని ప్రచురించిన కొత్తపల్లి శ్రీనివాసరావును 'ఈ మాసం కవి' రాచపాళెం రఘును, 'నిక్కచ్చి కవిత' బహుమతి పొందిన కవయిత్రి శరకణం కనకదుర్గను సంస్థ పక్షాన అధ్యక్షులు రావి రంగారావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ టి.సేవకుమార్, కృష్ణ సూర్యకుమార్ ఘనంగా సత్కరించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో చల్లా సత్యావతి, అమరాచారి, విజయలక్ష్మి, చంద్రయ్య పాల్గొన్నారు.



సాహితీవేత్తలు, నటులను సత్కరిస్తున్న రంగారావు, కృష్ణ సూర్యకుమార్

బీపీ నియంత్రణతో బ్రెయిన్‌స్ట్రోక్ దరి చేరదు

● న్యూరాలజిస్టు డాక్టర్ నీరజ

గుంటూరు, జూన్ 16: షుగర్, రక్తపోటు నియంత్రణలో ఉంచుకొంటే బ్రెయిన్ స్ట్రోక్ దరి చేరకుండా చూసుకోవచ్చని న్యూరాలజిస్టు డాక్టర్ నీరజ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆమె ప్రసంగించారు. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు, రక్తపోటుతో ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు వారి షుగర్ లెవెల్స్‌ను నియంత్రించుకోకుంటే. రెటినోపతి, కార్డియో మయోపతి, న్యూరోపతి, నెఫ్రోపతి మొదలగు సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని. రక్తపోటును కూడా నియంత్రణలో ఉంచుకో కుంటే బ్రెయిన్ స్ట్రోక్‌కు దారి తీసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయ ని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన సందర్భాల్లో ఎంత త్వరగా న్యూరాలజిస్ట్ వద్దకు వెళితే అంత త్వరగా కోరుకునే అవకాశాలు ఉంటాయని, సాధారణంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన నాలు గు గంటల లోపు వైద్యుల వద్దకు వెళ్లగలిగితే చాలా ఉత్తమమైన ఫలి తాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయిరాం, విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ళ ప్రసాద్ రావు, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్ రామచంద్రరావు, విశ్లేషకులు పాములరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నీరజ తదితరులు


గుండెపోటుతో ర్యాంకర్ ఎస్ఐ శివప్రసాద్ మృతి

గుంటూరు, జూన్ 16: ఉద్యోగ ఒత్తిడి కారణంగా గుండెపోటుకు గురైన ర్యాంకర్ ఎస్ఐ గాజుల శివప్రసాద్ మృతి చెందాడు. 1983 గుంటూరు జిల్లా ఎక్సలెంట్ పోలీస్ బ్యాచ్ సభ్యుడైన ఎస్ఐ గాజుల శివప్రసాద్ ఇటీవల ఎన్నికల సంద ర్భంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ మార్కాపురంలో బందోబస్తులో ఉండగా ఆరోగ్యం క్షీణించి పడిపోగా, అచ్చట నుంచి గుంటూరు రమేష్ హాస్పటల్ కు తరలించి వైద్యం చేయించారు. తిరిగి కొద్ది రోజుల్లోనే ఆరోగ్యం దెబ్బతిని శనివారం రాత్రి శివప్రసాద్ తుది శ్వాస విడిచారు. ఆదివారం గుంటూరులో అంత్యక్రియలు నిర్వహించారు. శివప్రసాద్ ఆకస్మిక మృతి పోలీస్ వర్గాలను ఆవేదనకు గురి చేసింది. గత ఎన్నికలకు ముందు ర్యాంకర్ ఎస్ఐలను నిబంధనల ప్రకా రం ఇతర జిల్లాలకు బదిలీ చేసారు. వీరిలో అత్యధిక మంది రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారు. కొందరు ఈ నెలాఖరుకు రిటైర్డ్ కాబోతున్నారు. ఎన్నికలు ముగిసినా వారిని తిరిగి జిల్లాకు కేటాయించక పోవడంతో వారు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం భారినపడుతున్నారని పోలీస్ అధికారులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వారందరినీ తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని పోలీస్‌వర్గాలు కోరుతున్నాయి. కాగా శిప్రసాద్ మృతి పట్ల పోలీస్ ఉన్నతాధికా రులు తీవ్ర విచారం వ్యక్తం చేసారు. కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు.


ఎస్ఐ శివ ప్రసాద్ (ఫైల్)

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

గుంటూరు, జూన్ 16: స్థానిక చుట్టుగుంట సెంటర్‌లో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వృద్ధురాలిని లారీ ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 15వతేదీ సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో గుంటూరు టౌన్ చుట్టుగుంటసెంటర్ నందు సుమారు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తుతెలియని మహిళని లారీ ఢీకొట్టింది. దీంతో బలమైన రక్త గాయాలు అవగా, రుద్ర ట్రస్ట్ వారు గాయపడిన ఆమెని గుంటూరుకి తీసుకుని వెళ్లి డాక్టర్‌కు చూపించగా అప్పటికే ఆమె చనిపోయినదని వైద్యులు నిర్ధారించారు. మృతురాలు ఆచూకీ గురించి విచారించగా, ఆమె చుట్టుపక్కల అడుక్కుంటూ తిరుగుతూ ఉంటుందనీ, ఆచూకీ అక్కడ ఉన్న వారికి తెలియదని చెప్పారు. ఆమె ఎరుపు, నలుపు రంగు గల పంజాబీ డ్రెస్ ధరించి ఉన్నది. మృతదేహాన్ని గుంటూరు మార్చురీ నందు భద్ర పరిచామన్నారు.. వివరాలు ఎవరి కైనా తెలిసినట్లయితే వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుకు 8688831445లో తెలియచేయాలన్నారు.


టీడీపీ సీనియర్ నాయకుడు పంచుమర్తి భూపతి రావు తల్లి పెద్ద కర్మ సందర్భంగా మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పశ్చిమ ఎమ్మె ల్యే గల్లా మాధవి, హైకోర్టు జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా జడ్జి తోక రాజా వెంకటాద్రి, టీడీపీ ముఖ్య నాయకులు కోవెలమూడి రవీంద్ర, కార్పొరేటర్లు ఘనంగా నివాళులు అర్పించారు. (గుంటూరు)

పేదల పెద్దకొడుకు చంద్రబాబు

ఎమ్మెల్యే గల్లా మాధవి


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పేదవాడి ఇంటి పెద్ద కొడుకుగా చంద్రబాబునాయుడు నిలిచిపోయారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సామాజిక భద్రతా పింఛన్ల పెంపును హర్షిస్తూ ఆదివారం ఆమె ఆధ్వర్యంలో పింఛనుదారులతో కలిసి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద వర్గాలకు ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ మొత్తం రూ.మూడు వేల నుంచి నాలుగు వేలకు పెంచి ప్రతి ఇంటి పెద్ద కొడుకులా వారికి అండగా నిలిచారన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన పెంచిన సొమ్ము నాలుగు వేలు అందుకుంటామని వృద్ధులు సంతోషంతో చెబుతున్నారన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ.2 వేలు ఉన్న పింఛన్ జగన్ హయాంలో రూ.3 వేలకు చేరుకునేందుకు ఐదేళ్ల పట్టిందని మాధవి ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఉప్పుతల సాంబ, రామరాజు, రబ్బాని, కృష్ణ, చిన్న మస్తాన్‌వలి, నాగూర్, ముత్తినేని రాజేశ్, రామచంద్రప్రసాద్, బోడాల అశోక్, లక్ష్మణ్, బాలకృష్ణ, కిశోర్, తన్నీరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య


రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించిన తెలుగు యువత మాజీ జిల్లా అధ్యక్షుడు ఈడే మురళీకృష్ణ


రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పెనుకొండ ఎమ్మెల్యే సవితను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి, ఆమెను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ జోన్ 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర

పార్టీని ముందుండి నడిపిన నాయకుడు అచ్చెన్న

● వడ్రాణం హరిబాబు

గుంటూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ధైర్యంగా ముందుండి నడిపిన నాయకుడు అచ్చెన్నాయుడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం హరిబాబు నాయుడు కొనియాడారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, మత్స్యశాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కింజరాపు అచ్చెన్నాయుడిని ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు ఎన్ని అక్రమ కేసులు బనాయించినా, జైల్లో పెట్టి హింసించినా ఏమాత్రం వెనకడుగు వేయకుండా ఆయన ముందుండి పోరాడారని, అదే స్ఫూర్తితో తాము కూడా పోరాటంలో నిలిచామని చెప్పారు. ఆయన అందించిన ధైర్యం, స్ఫూర్తి తోనే తాను పరిశీలకుడిగా ఉన్న గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకున్నామని చెప్పారు. రెండు నియోజకవర్గాల్లో చక్కగా బాధ్యతలు నిర్వహించిన హరిబాబును అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జనసేన గుంటూరు జిల్లా కార్యదర్శి ఉప్పు వెంకట రత్తయ్య, గుంటూరు పట్టణ ఉపాధ్యక్షుడు చింతా రేణుకారాజు పాల్గొన్నారు.


మంత్రి అచ్చెన్నాయుడిని సన్మానించిన వడ్రాణం హరిబాబు, జనసేన నేతలు

వీనుల విందుగా శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), జూన్ 16: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో నెలవారి కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం త్యాగరాజ స్వామి కళావేదికగా దేశిరాజు స్నిగ్ధ, చెన్నై వారి శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా సాగింది. వీరికి వయోలిన్‌పై నంద్‌కుమార్, మృదంగంపై మల్లాది శివానంద యశస్వి, విజయవాడ వారు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. కచేరీని బేగడ వర్ణంతో ఇంత చనువు వర్ణంతో ప్రారంభించి అనేక వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి సంగీతాభిమానులను అలరించారు. అనంతరం ఉపాధ్యక్షుడు ఎస్ గిరిజాశంకర్, కార్యవర్గం ఆధ్వర్యంలో కళాకారులను ఘనంగా సత్కరించారు.

తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి

వెలిగండ్ల, జూన్ 16: తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువులో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జుటికే సుందరరావు (57) సీఆర్‌పీఎఫ్‌లో జవాన్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. శనివారం ఆయన భార్య రోజమ్మతో కలిసి కనిగిరిలో బ్యాంకుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. బాపనపల్లి గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో భార్యాభర్తలు పంట పొలాల్లోకి పరుగులు తీశారు. అయినప్పటికీ తేనెటీగలు వదలలేదు. ఆ సమయంలో అటుగా ఆటోలో వెళ్తున్న వారు ముఖాలకు కండువాలు కప్పుకుని వెళ్లి భార్యాభర్తలను కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుందరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. చికిత్స అనంతరం రోజమ్మ కోలుకున్నారు.

ఒంటరి ఏనుగు దాడిలో రైతు మృతి

రామకుప్పం, జూన్ 16: చిత్తూరు జిల్లా కుప్పం రామకుప్పం మండలం పీఎం తాండా సమీపంలో శనివారం రాత్రి ఏనుగు దాడిలో ఓ రైతు మృతి చెందారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో పొలం వద్ద షెడ్‌లో ఆవులను కట్టేసి రైతు కన్నా నాయక్ ఇంటికి వెళుతున్నారు. మార్గమధ్యలో తన టమోటా తోటను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడం గమనించిన ఆయన భయంతో పరుగుతీశారు. కొద్ది దూరం వెళ్లగానే కింద పడిపోగా ఒంటరి ఏనుగు దాడిచేసి, తొండంతో దూరంగా విసిరేసింది. దీంతో కన్నానాయక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో నిలిచిన వర్షపు నీరు..



గుణదల సమీపంలో వాహనంతో చిరు వ్యాపారి ఇక్కట్లు..



ఏలూరు రోడ్డులో జోరుగా కురుస్తున్న వాన..

భారీ వర్షానికి విజయవాడ అతలాకుతలం

- గంటసేపు దంచికొట్టిన వాన
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- చెరువుల్లా మారిన రహదారులు

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గంట సేపు కురిసిన వర్షానికి నగరంలోని రహదారులు చెరువుల్లా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయిన ప్రాంతాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి పురపాలకశాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. భవిష్యత్తులో వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, జలమయం అయ్యే ప్రధాన రహదారులను క్షేత్రస్థాయిలో పర్యటించిన మంత్రి.. అధికారులకు సూచనలు చేశారు.

అక్కడక్కడా భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఆదివారం కోస్తా జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ రూరల్‌లో 83, ఏలూరు జిల్లా నిడమర్రులో 80, విజయనగరంలో 70, అల్లూరి జిల్లా కూనవరంలో 48.5, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 48.5, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 47.5, కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 31.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం అల్లూరి జిల్లాలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



క్యూలైన్‌లో వేచి ఉన్న సర్వదర్శన భక్తులు

శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం నుంచే రద్దీ పెరగ్గా, ఆదివారం కూడా అదే స్థాయిలో భక్తులు కిక్కిరిసి కనిపించారు. సర్వదర్శన భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వెనుకభాగంలోని రింగురోడ్డు మీదుగా నందకం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపించింది. వీరికి 36 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది.

టీటీడీ నిత్య అన్నదానానికి రూ.10 లక్షలు విరాళం

తుళ్లూరు, జూన్ 16: తిరుమల తిరుపతి దేవస్థానానికి తుళ్లూరు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బెజవాడ నరేంద్రబాబు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో శనివారం ఆయన కుటుంబ సమేతంగా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆయన రూ.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమరావతి రాజధాని శరవేగంగా చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి చెందాలని స్వామిని వేడుకున్నట్టు తెలిపారు.



టీటీడీ అధికారులకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న నరేంద్రబాబు

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

చెవి అనేది వినడానికి, సమతాస్థితికి ఉపయోగపడే జ్ఞానేంద్రియం. చెవి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఒటాలజీ అంటారు. మానవుడు 20 హెర్ట్‌జ్‌ల నుంచి 20,000 హెర్ట్‌జ్‌ల వరకు మాత్రమే ధ్వనిని వినగలుగుతాడు. దీనినే శ్రవ్య అవధి అని పిలుస్తారు. 20 హెర్ట్‌జ్‌ల కన్నా తక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వని తరంగాలను పరశ్రావ్యాలు అంటారు. వీటిని ఏనుగులు, గబ్బిలాలు, కుక్కలు వంటి జీవులు వినగలుగుతాయి.

చెవి నిర్మాణం

● బయాలజీ



చెవిలో మూడు భాగాలు ఉంటాయి.

అవి... బాహ్య చెవి, మధ్య చెవి, లోపలి చెవి.

బాహ్య చెవి: దీనిని వెలుపలి చెవి అని కూడా పిలుస్తారు. దీనిలో పిన్నా, బాహ్య శ్రవణ కుహరం, కర్ణభేరి త్వచము అనే మూడు భాగాలుంటాయి. పిన్నాను చెవి డొప్పగా పేర్కొంటారు. ఇది స్థితిస్థాపక మృదులాస్థి నిర్మాణం. బాహ్య శ్రవణ కుహరము ఒక వంపు తిరిగిన నాళంలా ఏర్పడి పిన్నా, కర్ణభేరి త్వచము మధ్య విస్తరించిన నిర్మాణం. చెవి డొప్ప, బాహ్యశ్రవణ కుహర చర్మంలో సున్నిత రోమాలు, మైనం అనేవి ఉంటాయి. చెవిలోకి దుమ్ము, ధూళి ఇతరత్రా రేణువులు ప్రవేశించకుండా రోమాలు, మైనం నిరోధిస్తాయి. కర్ణభేరి త్వచము శంఖువు ఆకారంలో ఉంటుంది. ఈ త్వచము బాహ్య శ్రవణ కుహరాన్ని, మధ్య చెవిని వేరు చేసే పలుచని అర్ధ పారదర్శక పొర. ఈ త్వచం శబ్దతరంగాలను బాహ్య చెవి నుంచి గ్రహించి మధ్య చెవిలోని కూటకానికి అందిస్తుంది.

వినికిడి ప్రక్రియ

బాహ్య చెవి శబ్ద తరంగాలను గ్రహించి కర్ణభేరి త్వచం మీదకు మళ్లిస్తుంది. ఈ శబ్దతరంగాలకు అనుగుణంగా కర్ణభేరి త్వచం కంపిస్తుంది. ఈ ప్రకంపనలు మూడు ఎముకలైన మాలియస్, ఇంకస్, స్టెపిస్ ద్వారా అండాకార రంధ్రపు కిటికీ వద్దకి చేరి కాక్లియాలోనికి ప్రవేశించి పెరిలింఫ్, ఎండోలింఫ్ ద్రవాలలో అలలను ఉత్పత్తి చేస్తాయి. ఈ అలలు బేసిల్లార్ త్వచంలో ఒక చిన్న అలను కలిగిస్తాయి. ప్రేరణ వల్ల బేసిల్లార్ త్వచంలోని హేర్ సెల్స్ ఒరిగి టెక్టోరియల్ త్వచం మీద ఒత్తిడి కలిగిస్తాయి. అందువల్ల సన్నిహిత అభివాహి నాడీ కణాలలో నాడీ ప్రచోదనం ఏర్పడి శ్రవణ నాడీ ద్వారా మెదడుని చేరుతుంది. అక్కడ నాడీ ప్రచోదనం విశ్లేషించబడి ధ్వని గుర్తించబడుతుంది.

మధ్య చెవి: మధ్య చెవి అనేది బాహ్య చెవి కర్ణభేరి త్వచానికి, లోపలి చెవి అస్థి విభాజకానికి మధ్యలో విస్తరించి ఉంటుంది. ఇది పుర్రెలోని టెంపోరల్ ఎముకలో ఏర్పడిన గాలితో నిండి ఉంటుంది. మధ్య చెవిలో మాలియస్, ఇంకస్, స్టెపిస్ అనే మూడు అస్థి ఖండాలు ఉంటాయి. మాలియస్‌ని హేమర్‌బోన్ అని, ఇంకస్ ని అన్విల్ బోన్ అని, స్టెపిస్‌ని స్టిరప్ బోన్ అని పేర్కొంటారు. ఈ ఎముకలు మూడు గొలుసులుగా ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. మాలియస్ తలభాగం ఇంకస్‌తో, పరాంతభాగం కర్ణభేరి త్వచంతో కలిసి ఉంటుంది. ఇంకస్ అనేది మధ్య ఎముక. ఇది స్టెపిస్ తలతో కలుపబడి ఉంటుంది. లోపలి చెవి అస్థివిభాజకంలోని అండాకార రంధ్రపు కిటికితో స్టెపిస్ కలుపబడి ఉంటుంది. ఈ మాలియస్, ఇంకస్, స్టెపిస్ మూడు ఎముకలు శబ్ద ప్రకంపనలను లోపలి చెవికి అందజేస్తాయి. మధ్య చెవి కుహరం గ్రసనిని కలుపుతూ యుస్టేషియన్ నాళం ఉంటుంది. ఈ నాళం కర్ణభేరి త్వచానికి ఇరువైపులా వాయు పీడనాన్ని సమానస్థాయిలో ఉంచడానికి తోడ్పడుతుంది.

లోపలి చెవి: వినికిడి ప్రక్రియలో ప్రధాన పాత్రను వహించేది లోపలి చెవి. ఇది ద్రవంతో నిండి ఉన్న కుహరం. దీనిని లాబరింత్ అంటారు. దీనిలో బోని లాబరింత్, మెంబ్రినస్ లాబరింత్ రెండు భాగాలు ఉంటాయి. బోని లాబరింత్‌లో వరుసగా కాక్లియా, వెస్టిబుల్, సెమి సర్క్యులర్ కెనాల్స్ అనే మూడు రకాల కుల్యలు ఉంటాయి.

ఎ.కాక్లియా: దీనినే కర్ణావర్తనం అని కూడా పిలుస్తారు. ఇది సర్పిలాకార నిర్మాణం. కాలా వెస్టిబ్యులి, స్కాలా మీడియా, స్కాలా టింపాని అనే మూడు సమాంతర నాళాలుంటాయి.

బి.వెస్టిబుల్: దీనిలోని ముందు భాగాన్ని సాక్యులస్ అని, వెనుక భాగాన్ని యుట్రిక్యులస్ అని పేర్కొంటారు. సాక్యులస్, యుట్రిక్యులస్ రెండింటిని కలిపి ఆటోలిత్ అంగంగా పిలుస్తారు.

సి. సెమి సర్క్యులర్ కెనాల్స్: ఇవి మూడు ఉంటాయి. ఒకదానికొకటి లంబకోణంలో అమరి ఉంటాయి. వీటి పీఠభాగం ఉబ్బి ఉంటుంది.

చెవికి సంబంధించిన అపస్థితులు

ఒటిటిస్ మీడియా: ఇది చిన్న పిల్లల్లో సాధారణంగా ఉండే అపస్థితి. మధ్య చెవిలోని యూస్టేసియన్ నాళం పొట్టిగా ఉన్నట్లయితే బ్యాక్టీరియా సంక్రమణకు గురైనప్పుడు చెవిలో చీము అధికంగా వస్తుంది.

టిన్నిటస్: మెదడులో కణితులు ఏర్పడినప్పుడు గాని, అధిక శబ్దాలు విన్నప్పుడు గాని చెవిలో మైనం(సెరుమినస్) అధికంగా ఏర్పడినప్పుడు గాని లోపలి చెవిలో ఉన్న హేర్ సెల్స్ దెబ్బతింటాయి.



కె.నాగశేషులు, సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి DIKSUCHI

అనాదిగా భారతీయ వంటగదిలోని పోపులపెట్టే చిన్నపాటి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ కాగా, పెరటిలోని అనేక మొక్కలు మందులనిచ్చే కల్పతరువులు. దెబ్బలకు పసుపు, కఫానికి తులసి, దగ్గుకు కరక్కాయ, దంత సంరక్షణకు వేపపుల్ల... ఇలా చెప్పుకొంటూపోతే భారతీయ సాంప్రదాయిక విజ్ఞానం ఒక వైద్యరంగం వద్దే ఆగిపోదు. వ్యవసాయం, పశుపోషణ వంటి అనేక రంగాల్లో మమేకమై కనిపిస్తుంది. అదేవిధంగా భారతదేశ భౌగోళిక, వాతావరణ వైవిధ్యతల దృష్ట్యా జన్యు వనరులపరంగా కూడా దేశం సుసంపన్నం.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



'జన్యు వనరులు', 'సాంప్రదాయిక జ్ఞానం'పై మేధాసంపత్తి ఒప్పందం

అయితే హఠాత్తుగా ఎవరోవచ్చి వీటి వైశిష్ట్యాలను ప్రయోగశాలల్లో తాము నిర్ధారించాము కాబట్టి వీటిపై తమకు యాజమాన్యపు హక్కులున్నాయని అంటే? తరతరాలుగా వస్తున్న సాంప్రదాయిక విజ్ఞానంపై మనకు హక్కు లేకుండా మేధాసంపత్తి హక్కులను వారు దాఖలుపర్చుకుంటే?

నిజానికి గతంలో అదీ జరిగింది. పసుపు, వేప వంటి భారతీయ సాంప్రదాయిక వైద్య విజ్ఞాన అంశాలతోపాటు, నేఫాల్, నేఫాల్-49 గోధుమ రకాలు, బాస్మతి బియ్యం వంటి జన్యు వనరులపై కూడా మేధాసంపత్తి హక్కులను విదేశీ సంస్థలు తీసుకున్నాయి. 1995లో అమెరికా తమ దేశంలోని యూనివర్సిటీ ఆఫ్ మిసిస్సిపీ మెడికల్ సెంటర్ పసుపునకు గాయాలు నయంచేసే గుణం ఉందని ప్రయోగాత్మకంగా రుజువు చేయడంతో పేటెంట్ మంజూరు చేసింది. అయితే ఇండియన్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) అందించిన చారిత్రక ఆధారాలతో తరవాత ఆ పేటెంట్ రద్దయింది.

అదేవిధంగా వేపకాయల నుంచి తీసిన అజాడిరాక్టిన్ ప్రధాన పదార్థంగా తయారుచేసిన ఒక ఔషధంపై 'డబ్ల్యూఆర్ గ్రేస్' అనే కంపెనీకి పేటెంట్ మంజూరైంది. అయితే దీనిపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించడంతో పునఃపరిశీలించి యురోపియన్ పేటెంట్ ఆఫీస్ దానిని రద్దు చేసింది. కానీ యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీస్ దానిని రద్దు చేయలేదు.

భారతదేశానికి చెందిన నాప్‌హాల్ గోధుమ రకాలపై 2003లో ఒక యురోపియన్ కంపెనీ బయోపైరసీ(ప్రకృతిసిద్ధ సహజ జన్యు పదార్థాల అక్రమ వినియోగం) చేసి పేటెంట్లు పొందింది. వాస్తవానికి ఇవి సహజ వనరులని, కొత్త ఆవిష్కరణలు కావని భారత అధికారులు సాక్ష్యాలు సమర్పించడంతో పేటెంట్లు రద్దుచేశారు.

ఇదేవిధంగా 2000 సంవత్సరంలో కూడా ఒక అమెరికన్ కంపెనీ బాస్మతి బియ్యంపై పొందిన పేటెంట్‌ను రద్దు చేయించడానికి భారతీయ అధికారులు పెద్ద న్యాయపోరాటమే చేశారు.

ఈవిధంగా ఒక దేశానికి లేదా ప్రాంతానికి చెందిన సాంప్రదాయిక జ్ఞానం, జన్యు వనరులపై వేరొకరు పేటెంట్ పొందడమంటే వారి హక్కులను హరించడమే కాదు, న్యాయంగా వారికి దక్కాల్సిన ప్రయోజనాలు దక్కకుండా పోవడమే. అందుకే ఈ సమస్యను పరిష్కరించడానికి సాంప్రదాయిక, జన్యు వనరులను ఎవరైనా వినియోగిస్తున్నప్పుడు న్యాయబద్ధంగా సంబంధీకులకు దక్కాల్సిన వాటాను అందించడానికి తోడ్పడేలా 2010లో నగోయా ప్రోటోకాల్ తీసుకువచ్చారు. అయితే ఇది అంత సమర్థంగా పనిచేయకపోతుండటంతో మరో కొత్త కట్టుబాటు అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(వరల్డ్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్) ఇటీవల 'ట్రీటీ ఆన్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ(ఐపీ), జెనెటిక్ రిసోర్సెస్ (జీఆర్స్) అండ్ అసోసియేటెడ్ ట్రెడిషనల్ నాలెడ్జ్(ఏటీకే) (మేధా సంపత్తి, జన్యు వనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం) తీసుకువచ్చారు.

ప్రపంచ మేథోసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ) ప్రధాన కార్యాలయం(జెనీవా)లో 2024 మే 13-24 మధ్య రెండువారాల పాటు, 192 దేశాలు 86 మంది పరిశీలకులు సుదీర్ఘ చర్చలు జరిపిన దరిమిలా మే 24న 'మేధాసంపత్తి, జన్యువనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం' సాకారమైంది.

మేధాసంపత్తి హక్కు అంటే?

ఒక వ్యక్తి లేదా సంస్థ ఆవిష్కరణలను, ఇతరులు కాపీచేసి వారు అనాయాస లబ్ధి పొందకుండా ఆవిష్కర్తకు ఆ ఆవిష్కరణపై కొంత కాలానికి సర్వహక్కులు కల్పిస్తూ ఇచ్చే చట్టబద్ధమైన హక్కు.

ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ)

- ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక అంగము. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది.
- దీనిని మేథోసంపత్తి హక్కుల విషయమై అంతర్జాతీయ సహకారం పెంపొందించడానికి 1967లో ఏర్పాటుచేశారు.
- దీనిలో 193 సభ్యదేశాలున్నాయి.
- భారతదేశం 1975లో దీనిలో చేరింది.
- మేధాసంపత్తి హక్కుల విషయమై చర్చలకు ఒక అంతర్జాతీయ వేదికగా, వివాద పరిష్కార కేంద్రంగా పనిచేస్తుంది.
- అంతర్జాతీయ మేధాసంపత్తి ఒప్పందాలను పర్యవేక్షిస్తుంది.
- మేధాసంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్ చేస్తుంది.

ఒప్పంద ముఖ్యాంశాలు

1. ఇప్పటివరకూ ఉన్న మేథోసంపత్తి పరిరక్షణ ఒప్పందాలన్నింటిలోనూ సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులపై స్థానికులకు ఉన్న హక్కును గుర్తించిన ఏకైక ఒప్పందం ఇది.

2. ఒక దేశానికి సంబంధించిన సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులను ఇతరులు దోచుకోకుండా, అక్రమంగా వినియోగించుకోకుండా ఈ ఒప్పందం అడ్డుకుంటుంది. దీనిలో ఉన్న 'మాండేటరీ డిస్‌క్లోజర్ ఆబ్లిగేషన్స్' అనే నిబంధన ప్రకారం పేటెంట్ దరఖాస్తుదారు ఏదైనా జన్యువనరులను గానీ, సాంప్రదాయిక విజ్ఞానాన్ని గానీ తమ ఆవిష్కరణలో వినియోగిస్తే అది ఏ దేశానికి చెందిందో, ఆ విజ్ఞానాన్ని పరిరక్షిస్తున్న వారెవరో కూడా స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.

3. ఈ ఒప్పందం ద్వారా జన్యు వనరులు, సాంప్రదాయిక విజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా పరిరక్షించేందుకు అన్ని భాగస్వామ్య దేశాలు తమ దేశీయ మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్'(సదరు జన్యు వనరు/సాంప్రదాయిక విజ్ఞానం ఏ ప్రాంతానికి చెందిందో వెల్లడించే) నిబంధనను చేర్చాల్సి ఉంటుంది.

4. ఈ ఒప్పందం సాంప్రదాయిక విజ్ఞానం, జన్యువనరుల నుంచి నేరుగా సంగ్రహించిన అంశాలకు కాక వాటిని వినియోగించి చేసిన సరికొత్త ఆవిష్కరణలకు మాత్రమే మేథోసంపత్తి హక్కులను అందించడానికి సమ్మతిస్తుంది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఒప్పంద ప్రయోజనాలు

1. సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల సంవృద్ధి గల భారతదేశం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించగలుగుతారు.

2. బయోపైరసీ ద్వారా ఇతరులు అక్రమ లబ్ధి పొందడాన్ని నివారించి సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల పరిరక్షణతో సంబంధం గల స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.

3. మేధాసంపత్తి హక్కుల పరిరక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలు ఏర్పడి, దేశాల మధ్య మేధాసంపత్తి హక్కుల వివాదాలు తగ్గుముఖం పడతాయి. పారదర్శకత పెరుగుతుంది.

4. విజ్ఞాన చౌర్యం, జన్యు వనరుల నకిలీలు తయారు కాకుండా ప్రాచీన విజ్ఞానం, జన్యు వనరుల ఆధారంగా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చు.

అయితే 1999 నుంచి జరిపిన సుదీర్ఘ చర్చల ప్రతిరూపంగా 25 సంవత్సరాల తరవాత సాకారమైన ఈ ఒప్పందం అమలులోకి రావాలంటే కనీసం 15 సభ్యదేశాలు సంతకాలు చేసి, దానిని ర్యాటిఫై (ధృవీకరించాల్సి) ఉంటుంది. అదేవిధంగా ఇది పటిష్టంగా అమలుకావాలంటే అన్ని దేశాలు తమ మేధాసంపత్తి హక్కుల చట్టాలను ఈ ఒప్పందానికి అనుగుణంగా సరిదిద్దాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు కేవలం 35 దేశాల్లో మాత్రమే 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్' వంటి నిబంధనలు వారి మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో చేర్చారు. ఇకముందు ఎన్ని ఎక్కువ దేశాలు ఇలాంటి నిబంధనలను స్వీకరిస్తాయన్న దానిపైనే ఈ ఒప్పంద అమలు ఆధారపడి ఉంటుంది. ఈ ఒప్పందం పటిష్టంగా అమలుకావడమంటే ప్రపంచ జీవవైవిధ్యంలో ఏడు నుంచి ఎనిమిది శాతం వరకు కలిగి ఉన్న, సాంప్రదాయిక విజ్ఞానపరంగా సుసంపన్నమైన భారతదేశానికి శుభపరిణామమే.



పౌరసరఫరాల మంత్రి నాదెండ్లను గజమాలతో సత్కరిస్తున్న జనసేన నాయకులు షబ్బీర్, ఎమ్మార్వో మెహర్‌కుమార్, దావూద్ తదితరులు

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్లకు ఘన సత్కారం

తెనాలి, మారీసుపేట జూన్ 16: తెనాలి నియెజకవర్గ కూటమి ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫర శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్‌ను జనసేనపార్టీ నాయకులు సయ్యద్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. జనసేన పార్టీ కార్యాలయంలో నాదెండ్ల మనోహర్ రాష్ట్ర పౌరసరఫర శాఖ మంత్రి బాధ్యతలు స్వీకరించి తెనాలికి వచ్చిన సందర్భంగా జనసేన పార్టీ నాయకులు సయ్యద్ సబ్బీర్, కారంపూడి ఎమ్మార్వో మెహర్ కుమార్, షేక్ దావూద్ మిత్రమండలి సభ్యులు భారీ గజమాలతో సత్కరించి, శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



మంత్రి మనోహర్‌ను సత్కరిస్తున్న వెంకటపూర్ణచంద్, హరిబాబు, సుబ్బారావు, తదితరులు

రాష్ట్ర వాణిజ్యవిభాగ శాఖ ఆధ్వర్యంలో...

తెనాలి రూరల్, జూన్ 16: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మనోహర్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర వాణిజ్యవిభాగ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, ఒంగోలు మాజీ శాఖ సభ్యుడు ఈదర హరిబాబు, ఈదర సుబ్బారావులు కలిసి దుశాలువాలతో మనోహర్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు వెంకట్రామయ్య

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉమ



మాజీమంత్రి ఆలపాటి కాంస్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమ, రమేష్ తదితరులు

తెనాలి, మారీసుపేట జూన్ 16: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, తెనాలి పురపాలక సంఘ మాజీ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య చిరస్మరణీయుడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఆదివారం రాష్ట్ర మాజీమంత్రి, తెనాలి పురపాలక సంఘ మాజీ చైర్మన్ ఆలపాటి వెంకట్రామయ్య కాంస్య విగ్రహం వద్ద ఆయన 105వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన మనుమరాలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ లక్ష్మీప్రసాద్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్రమంత్రిగా, పురపాలక సంఘ చైర్మన్‌గా ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి రమేష్, కొడాలి శ్రీనివాసరావు, ఉయ్యూరు రాజశేఖరరెడ్డి, నేలటూరి బెన్ని తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి గణేష్ యూత్ ఆర్థికసాయం



క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న వీరవల్లి మురళి, నాగభూషణం తదితరులు

తెనాలి రూరల్, జూన్ 16: గుట్కా, ఖైనీలను ప్రభుత్వం నిషేధించి ఆ మహమ్మారి బారిన పడకుండా ప్రజలను కాపాడాలని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెదరావూరులో జెండా చెట్టు బజారులో నివసించే టీడీపీ కార్యకర్త షేక్ సయూబ్ నోటిక్యాన్సర్ బారిన పడ్డాడు. అతడు వడ్రంగి పని చేసే కార్మికుడు. వివాహితుడైన ఇతడికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. అతడి పరిస్థితి తెలుసుకున్న గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, అంగలకుదురు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, షేక్ సలాం, ఎల్ఎంఎల్ ఖాదర్, పాలడుగు జగన్, జానీభాష, రసూల్ మిత్రబృందం కలిసి వైద్యఖర్చుల నిమిత్తం రూ.42వేలు అందించారు. ఈ సందర్భంగా వీరవల్లి మురళి మాట్లాడుతూ ఖైనీ, గుట్కా వంటి ఉత్పత్తులతో సామాన్యులు అనారోగ్య సమస్యల బారినపడి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాధనంతో కొన్న ఫర్నీచర్ ప్రభుత్వానికిచ్చేయాలి: వీరవల్లి

తెనాలి రూరల్, జూన్ 16: ప్రజాధనంతో కొన్న రూ.కోట్ల విలువజేసే ఫర్నీచర్, కంప్యూటర్లు, ఏసీలు వంటివి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి కూటమి ప్రభుత్వానికి అందించాలని గణేష్ యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అంగలకుదురులో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ప్రజాధనంతో కొన్న వస్తువులను తిరిగి కూటమి ప్రభుత్వానికి అందించాలన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి వీటిని రికవరీ చేయాలని ఆయన డిమాండ్‌చేశారు. అప్పటి సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరరావుపై మాజీసీఎం జగన్ ప్రజాధనం దుర్వినియోగం చేశారని పెద్దపెద్ద మాటలతో నానా రచ్చచేశారన్నారు. అప్పటి సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరరావుపై తీసుకున్న చట్టపరమైన చర్యలను జగన్‌మోహన్‌రెడ్డిపై కూడా తీసుకోవాలని మురళి కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. కోడెలపై ఫర్నీచర్ దొంగ అంటూ వైసీపీ ప్రభుత్వం వేధించి ఆత్మహత్య చేసుకునేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాధనంతో కొన్న వస్తువులపై సీఎం చంద్రబాబు కఠినచర్యలు తీసుకోవాలని మురళి విజ్ఞప్తి చేశారు.



శాంతి హోమంలో పాల్గొన్న బాలస్వామి

వైభవంగా శాంతి హోమాలు

తెనాలి, మారీసుపేట జూన్ 16: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్టఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) స్వయం పర్యవేక్షణలో శ్రీనవగ్రహ సహిత శ్రీనక్షత్ర సంపూర్ణ శాంతి హోమంను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. 4వ రోజు ఆదివారం హస్త నక్షత్రం వారిచే గణపతి పూజ, రుద్రాభిషేకాలు, గణపతి హోమం, నవగ్రహ హోమం, శ్రీమహామృత్యుంజయ హోమంను యల్లాప్రగడ పవన్‌కుమార్‌శర్మ రుత్వికులతో యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ములుకుట్ల విశ్వనాథశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ శాంతి హోమం ఫలితాలను తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, కోన నాగేశ్వరావు, పెనుగొండ వెంకటేశ్వరావు, చుండూరు లోకనాధం, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కంటి వైద్యం కోసం వృద్ధుల అవస్థలు



మెట్లు ఎక్కలేక కూర్చున్న వృద్ధుడు, మొదటి అంతస్తుల్లో ఉన్న కంటి వైద్య విభాగం

● జిల్లా వైద్యశాలలో మొదటి అంతస్తులో కంటి వైద్యం

● కంటి సమస్యలతో వచ్చేవారిలో వృద్ధులే అధికం

● కిందకు మార్చాలని వృద్ధుల వినతి

తెనాలి రూరల్, జూన్ 16: జిల్లాలోనే అతిపెద్ద రెండో వైద్యశాలగా గుర్తింపుపొందిన తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో కంటి విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇది ఆసుపత్రి ఓపీ కౌంటర్ నుంచి మొదటి అంతస్తులో 36వ నెంబరు గదిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడే ఆప్తమాలజీ విభాగం కూడా దాని ఎదురే ఉంటుంది. ఇక్కడ వైద్యులు కంటి లోపాలను గుర్తించి వారికి తగిన కళ్లజోళ్లు సిఫారసు చేస్తుంటారు. ఈ వైద్యశాలలో వైద్యసేవలు పొందేందుకు తెనాలి, కొల్లిపర, వేమూరు, కొల్లూరు, చుండూరు, చేబ్రోలు, దుగ్గిరాల వంటి మండలాల నుంచి పెద్దసంఖ్యలో దృష్టి సమస్యలున్న వారు వచ్చి వైద్యసేవలు పొందుతుంటారు. ఇదే ఆసుపత్రిలో కంటికి శుక్లాలు తీయడం, ఇతరత్రా శస్త్రచికిత్సలకు ప్రత్యేక ఆపరేషన్ గది కూడా ఉంది. ఎక్కువ శాతం ఆరోగ్యశ్రీ ద్వారా శుక్లాలు తొలగించడం ఇతర శస్త్రచికిత్సలు చేస్తుంటారు. వీరిని డిశ్చార్జ్ చేసేంత వరకూ ఆసుపత్రిలోనే కంటి వార్డులో ఉంచి వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. ఆసుపత్రిలో వృద్ధులు, దివ్యాంగులు ఓపీ సేవల ద్వారా వైద్యసాయం పొందాలంటే ఇబ్బందులకు గురిఅవుతున్నారు. అందుకు ప్రధానంగా ఆసుపత్రిలోని ఓపీ కౌంటర్ వద్ద పేరు నమోదు చేయించుకుని ఆసుపత్రి మొదటి అంతస్తుకు సుమారుగా 32మెట్లు ఎక్కి వైద్యులను సందర్శించిన అనంతరం తిరిగి కిందకు రావాల్సి ఉంటుంది. వృద్ధాప్యంతో ఉన్న వారు, వైకల్యంతో వచ్చే దివ్యాగులకు ఎత్తుగా ఉండే మెట్ల ద్వారా పైకి ఎక్కి వైద్యం పొందేందుకు సమస్యగా మారింది. వారితో పాటు వచ్చే సహాయకులు సైతం వృద్ధుల అవస్థలు చూసి ఆవేదనకు గురవుతున్నారు. వైద్యశాలకు వచ్చి కంటి వైద్యం కోసం మెట్లు చూసి పైకి ఎక్కలేక వెనుదిరిగే పరిస్థితి గత కొంత కాలంగా నెలకొంది. కార్పొరేటు ఆసుపత్రులలో కంటి వైద్యం ఖరీదైన వ్యవహారం కావడంతో పేదలు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ వైద్యశాలకే వస్తుంటారు. వృద్ధులు, దివ్యాగులు పైకి ఎక్కే పరిస్థితి లేక దృష్టిలోపాలతోనే కాలం వెల్లబుచ్చేపరిస్థితి ఉంది.

ఆసుపత్రిలోని అన్ని వార్డులను ప్రతిరోజు పర్యవేక్షిస్తూ రోగులకు నాణ్యమైన వైద్యం చేరువచేసే సద్దుదేశంలో ఏర్పాటు చేసిన సూపరింటెండెంట్ ఆసుపత్రిలో పర్యటించకుండా తనకు కేటాయించిన గదికే పరిమితమవుతుందన్నారన ఆరోపణలు ఉన్నాయి. వైద్యశాల్లో ఉన్నతాధికారే ఈ విధంగా ఉండటంతో రోగులకు మంచి ఆహారం అందించాల్సిన కాంట్రాక్టర్ సైతం నాణ్యతా ప్రమాణాలుపాటించని ఆహారాన్ని సమయపాలన లేకుండా తనకు తోచిన విధంగా అందిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారాన్ని సూపరింటెండెంట్ పరిశీలించిన పిదప వాటిని సకాలంలో వార్డుల వారీగా పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఐతే ఆమె బాధ్యతాయుతంగా వ్యవహరించకపోవడంతో ఆసుపత్రిలో పలు విభాగాల్లో రోగులకు నాణ్యమైన సేవలు, సౌకర్యాలు అందడంలో జాప్యం జరుగుతోంది. ఆసుపత్రిలోని సమస్యలను సూపరింటెండెంట్ పరిశీలించి చర్యలు పట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. కంటి వైద్యసేవలను కిందకి మార్చాలని పలువురు వృద్ధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొల్లిపర మండలంలో భారీ వర్షం

● జలమయమైన రోడ్లు



తూములూరులో నీటితో నిండిపోయిన సిమెంట్ రోడ్డు

కొల్లిపర, జూన్ 16: మండలంలో ఆదివారం సాయంత్రం కుంభవృష్టిగా వర్షం పడింది. దీంతో రోడ్లు అన్నీ జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా వర్షం పడటంతో మురుగు కాల్వల్లోని నీరు ఎక్కడికక్కడ స్తంభించాయి. మున్నంగి, వల్లభాపురం, తూములూరు, చివలూరు, సిరిపురం, దావులూరు, దావులూరిపాలెం తదితర గ్రామాల్లో ప్రధాన రహదారులు సైతం వర్షం నీటితో నిండిపోయాయి. అధికంగా వర్షం నీరు చేరడంతో గృహాల్లో నుంచి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. రహదారులపై గజంలోతు నీరు చేరడంతో వాహనాదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. మండల కేంద్రం కొల్లిపరలో ప్రధాన రహదారులు సహితం నీటితో నిండిపోయాయి. శివాలయం దగ్గర నుంచి గ్రామపంచాయతీ వరకు నీటితో నిండి పోవడంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు.

ఐకమత్యంగా సంఘాన్ని అభివృద్ధి చేసుకుందాం

అర్చక సంఘ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు వేణుగోపాల్

కొల్లిపర, జూన్ 16: అర్చక సేవాసంఘం సభ్యులు ఐకమత్యంగా ఉండి సంఘాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని అర్చక సంఘ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో రాష్ట్ర అర్చక సేవా సంఘం జెఏసీ ఆధ్వర్యంలో మండల అర్చక సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జగన్నాధాచార్యులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణం వేణుగోపాల్ మాట్లాడుతూ అర్చక సమాఖ్య సభ్యులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం అర్చక సమాఖ్య అధ్యక్షుడుగా మాల్యవంతం వెంకటరమణాచార్యులు, ఉపాధ్యక్షుడుగా లీలానాగచలపతిరావు, ప్రధానకార్యదర్శిగా కొల్లిపర అవినాష్, కొల్లిపర నిరంజన్‌కుమార్, సహాయ కార్యదర్శిగా అశ్వనీకుమార్, కోశాధికారిగా చిలుమూరు సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వెంకటరామలింగేశ్వరశర్మ, అర్చక సమాఖ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

గుంటూరు (కార్పొరేషన్), జూన్ 16: పాత బస్టాండ్ లాలాపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుంచి 23 తారీకు వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తు న్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాసరావు (వాసు) ఆదివారం తెలిపారు. నేటి ఉదయం వెంకటేశ్వర స్వామి వారిని, అలివేలు మంగాదేవి పెళ్లి కుమారుడు పెళ్లి కుమార్తెగా అలంకారం చేయనున్నారు.



రావి వెంకట రమణను అయన గృహంలో కలిసిన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

రావిని కలిసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, జూన్ 16: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఆదివారం గుంటూరులోని రావి వెంకటరమణ గృహానికి వెళ్లిన నరేంద్రకుమార్ ఎన్నికల సందర్భంగా జరిగిన పరిణామాలపై చర్చించారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన రావి వెంకట రమణకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఉమామహేశ్వరావు, నవ్య, ప్రసాద్ తదితరులు

తెనాలి, మారీసుపేట జూన్ 16: స్థానిక నందులపేటలోని వేజళ్ళ వెంకట సుబ్బారావు మెమోరియల్ విద్యా ట్రస్టు కార్యాలయంలో ఆదివారం పట్టణ పురపాలక పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ పలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక ఉపకార వేతనాలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వరావు పాల్గొని 10వ తరగతిలో 560మార్కులు పైగా సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు రూ.1116లు ప్రతిభా పురస్కారాలను అందించారు. నిర్వహకులు ట్రస్ట్ కార్యదర్శి వేజళ్ళ నవ్య మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ట్రస్టు ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బీసీ కాలనీలో వేజళ్ళ వెంకట సుబ్బారావు పురపాలక ప్రాథమిక పాఠశాలను నిర్మించామన్నారు. ప్రతిభ కనపరిచిన పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఓంకార్ గ్రాఫిక్స్ ప్రసాద్, సీఆర్‌పీ శ్రీదేవి, ఉపాధ్యాయులు శివప్రసాద్, బాస్కరరావు, శ్యామ్‌ప్రసాద్, టి శివ ప్రసాద్, రాజేంద్ర, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమరసత సేవా ఫౌండేషన్ ఇంటింటి ధర్మప్రచారం



ధర్మప్రచారంలో భాగంగా కరపత్రాలు పంచుతున్న ఫౌండేషన్ సభ్యులు

తెనాలి రూరల్, జూన్ 16: సమరసత సేవా ఫౌండేషన్ ఈ నెల 10నుంచి 25 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి ధర్మ ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం తెనాలి సాలిపేటలో ఫౌండేషన్ సభ్యులు ఖండ సంయోజక్ కడియాల సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటికివెళ్ళి కరపత్రాలు పంచి స్టిక్కర్లు అంటించి హిందూ ధర్మం గొప్పదనాన్ని తెలియజేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమ శంకరరావు, నందికంటి రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవడం మన బాధ్యత

● పాలడుగు అంజయ్య

తెనాలి రూరల్, జూన్ 16: దేశానికి అన్నం పెట్టె రైతులకు అండగా నిలబడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పాలడుగు రంగయ్య- అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పాలడుగు అంజయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పెదరావూరులో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద రైతులు వ్యవసాయం చేసుకునేందుకు ట్రాక్టర్‌తో 100ఎకరాలు దుక్కి దున్నించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పాలడుగు అంజయ్య మాట్లాడుతూ ప్రతిఏటా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద రైతులకు 100 ఎకరాలపైన దుక్కులను దున్నిస్తున్నామన్నారు. ట్రస్ట్ తరుపున ప్రతి నెల ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున 10వ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహ బహుమతులు, స్కాలర్‌షిప్‌లు ఇచ్చి వారిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, పాలడుగు సురేంద్ర, రైతు నాయకులు గుమ్మడి ప్రసాద్, సాల్మన్, పాలడుగు సుధీర్, పి.పూర్ణచంద్, హరినాథరెడ్డి, పి.కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కిషోర్, నాగేశ్వరరావు, రమేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



దుక్కులు దున్నేందుకు ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు అంజయ్య తదితరులు

ర్యాంకర్ ఎస్ఐ శివప్రసాద్ మృతి

గుంటూరు, జూన్ 16: ఉద్యోగ ఒత్తిడి కారణంగా గుండెపోటుకు గురైన ర్యాంకర్ ఎస్ఐ గాజుల శివప్రసాద్ మృతిచెందాడు. 1983 గుంటూరు జిల్లా ఎక్సలెంట్ పోలీస్ బ్యాచ్ సభ్యుడైన ఎస్ఐ గాజుల శివప్రసాద్ ఇటీవల ఎన్నికల సందర్భంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ మార్కాపురంలో బందోబస్తులో ఉండగా ఆరోగ్యం క్షీణించి పడిపోగా, అచ్చట నుంచి గుంటూరు రమేష్ హాస్పటల్‌కు తరలించి వైద్యం చేయించారు. తిరిగి కొద్ది రోజుల్లోనే ఆరోగ్యం దెబ్బతిని శనివారం రాత్రి శివప్రసాద్ తుదిశ్వాస విడిచారు. ఆదివారం గుంటూరులో అంత్యక్రియలు నిర్వహించారు. గత ఎన్నికలకు ముందు నిబంధనల ప్రకారం ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.



తక్కెళ్ళపాడులో చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుని, మసీదు జెండా చెట్టు వద్ద ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

ప్రతి కార్యకర్త సేవలను గుర్తుపెట్టుకుంటా

● తక్కెళ్ళపాడులో ఎన్నికల మొక్కుబడి తీర్చుకున్న కార్యకర్తలు

● ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పెదకాకాని, జూన్ 16: పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త సేవలను గుర్తుపెట్టుకుంటానని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ నరేంద్ర కుమార్ తెలిపారు. గత ఎన్నికల్లో నరేంద్రకుమార్ గెలుపొందాలని, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని కాంక్షిస్తూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మొక్కిన మొక్కుబడులను ఆదివారం తీర్చుకున్నారు. గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారికి, శివాలయం, అద్దంకమ్మతల్లి, మాబుసుభాని జెండా చెట్టు వద్ద కొబ్బరికాయల కొట్టు మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నరేంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తుల తరపున మొక్కుబడి తీర్చారు. రాష్ట్రంలో రావణాసురుడి పాలన అంతమైందని, రామరాజ్యం వచ్చిందన్నారు. ప్రజలకు కావలసినటువంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అభివృద్ధి దిశగా పొన్నూరు నియోజకవర్గం పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరించిన యాదవ ఎంప్లాయీస్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అఖిలేష్, హరిప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు

యువతకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

● యాదవ ఎంప్లాయీస్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అఖిలేష్

తెనాలి, మారీసుపేట జూన్ 16: యువతకు క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని యాదవ ఎంప్లాయీస్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ తాడిబోయిన అఖిలేష్ అన్నారు. స్థానిక బాలాజీరావు పేటలోని బృందావనం హోటల్‌లో ఆదివారు 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను యాదవ ఎంప్లాయీస్ ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సత్కరించి ఉపకార వేతనాలను అందించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, న్యాయవాది, టీడీపీ నాయకులు తాడిబోయిన శ్రీనివాసరావులు, ముఖ్య అతిథిగా డాక్టర్ తాడిబోయిన అఖిలేష్‌లు పాల్గొని 55మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు, రాత పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో తట్టుకోళ్ళ అశోక్‌యాదవ్, కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మేశ్వరావు, కుర్రా శ్రీనివాస్, టీ శ్రీనివాసపండిట్, లక్ష్మీనారాయణ, అంబరీషుడు, ఎం బాలాజీ, కరేటి రవి, కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, కవులు, సంఘ సేవకులు

బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు

తెనాలి రూరల్, జూన్ 16: పట్టణంలోని శ్రీ రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బీజేఆర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించారు. పదో తరగతిలో 500మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు బట్టలు, కాలేజ్‌బ్యాగ్, వాటర్ బాటిల్స్ వంటి అందించి శుభాకాంక్షలు తెలిపారు. కొలకలూరుకు చెందిన కవి సాహితీరత్న పూర్ణప్రజ్ఞాచారికి, పలు రంగాల్లో ప్రతిభకనబరిచిన కవులకు, ఇతర సంఘ సేవకులను సత్కరించి వారికి మెమెంటోలు అందించారు. బీజేఆర్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిద్దెల కమలాకర్, నలుకుర్తి సద్గుణరావు, సుద్దపల్లి నాగరాజు, నలుకుర్తి రమేష్, అత్తోట శరత్ బాబులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కొసరాజు మృతి



కొసరాజు సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

పొన్నూరు టౌన్, జూన్ 16: రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కొసరాజు సత్యనారాయణ ఆదివారం మృతిచెందారు. పొన్నూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొసరాజు సత్యనారాయణ రోటరీ క్లబ్‌లో కీలకంగా వ్యవహరిస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవలే కోట్లాది రూపాయల విలువైన స్థలాన్ని రోటరీ క్లబ్ నిర్మాణం కోసం దానంగా అందించారు. గత కొంత కాలంగా సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయన మృతికి రోటరీ క్లబ్ నిర్వాహకులు పట్టణ ప్రముఖులు నివాళులు అర్పించారు. సత్యనారాయణ అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు బంధువుల, రోటరీ నిర్వాహకులు తెలియజేశారు.

శలపాడులో సాయి మందిర వార్షికోత్సవం

చేబ్రోలు, జూన్ 16: మండల పరిధిలోని శలపాడు గ్రామంలోని షిర్డీ సాయి బాబా మందిరం 10వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుతీరిన షిర్డీ సాయిబాబా మహాగణపతి, దత్తాత్రేయులకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అర్చన నిర్వహించారు. సాయంత్రం ఉయ్యాల సేవ, పల్లకిసేవ జరిపారు. ఈ సందర్భంగా మందిరంలో సాయి చాలీసా పారాయణం, అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.